కార్పొరేట్లకు వరాలు - పేదలకు శాపాలు

# దారి తప్పుతున్న టిడిపి కూటమి ఏడాది పాలన

హామీలే తప్ప అమలెక్కడ?

సామాన్యులకు దూరమైన సంక్షేమం..

యువతకు దక్కని అభివృద్ధి..




ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ కమిటీ

తెలుగుదేశం నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 2025 జూన్ 12 నాటికి సంవత్సరం పూర్తయ్యింది. జగన్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ప్రజలు టిడిపి కూటమికి ఎన్నడూలేనంత ఘన విజయం చేకూర్చారు. తమ ఆశలకు తగ్గట్లుగా పాలన లేదని నేడు ప్రజలు పెదవి విరుస్తున్నారు. టిడిపి, జనసేన శ్రేణులు సైతం సంతృప్తిగా లేరు. సంవత్సరమైనా హామీలు సుదూరంగా కనిపిస్తున్నాయి. ఏడాది పాలన నడకను సమీక్షించుకొని దిశ, దశను మార్చుకోకపోతే ఆశలు సన్నగిల్లి అసంతృప్తిగా మారుతుంది. అసంతృప్తి ప్రభుత్వంపై ఆగ్రహంగా మారుతుంది.

వైసిపి ప్రభుత్వ నిర్బంధచర్యలు, మోపిన భారాలు, పాలనా వైఫల్యాలు ఆ పార్టీని ఘోరంగా ఓడించాయి. 'ప్రజాగళం' పేరుతో కూటమి పార్టీలు ఇచ్చిన 'సూపర్ 6'తో పాటు, 143 రకాల హామీలు తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల భారీ విజయానికి కారణమయ్యాయి. చంద్రబాబు నాయుడు అనుభవం కలిగిన సమర్థ నాయకుడని నమ్మి ఓట్లేసిన ప్రజలు మోసపోయామని భావిస్తున్నారు. తమకిచ్చిన వాగ్దానాలు వేగంగా అమలు చేస్తారని అనుకున్నా నిరాశే ఎదురైంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని ఫణంగా పెట్టి బిజెపి బాటలో నడుస్తోంది. సంవత్సర కాలమైనా హామీలు అమలు కావడం లేదు. అన్ని హామీలను సంవత్సరంలోనే అమలు చేయడం సాధ్యం కాకపోవచ్చు, కానీ ప్రభుత్వ అడుగులు ఆ దిశగా వున్నాయా? లేవా? అని పరిశీలించుకోవడానికి సంవత్సర పాలనతీరు ఒక ముఖ్యమైన సందర్భం.

"డబుల్ ఇంజన్ సర్కార్" పేరుతో కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వాలు వుంటే అభివృద్ధి, సంక్షేమం ఉరుకులు, పరుగులతో సాగుతాయని టిడిపి, జనసేన పార్టీలు బిజెపితో చేతులు కలిపాయి. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమిలో టిడిపి చేరింది. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి సాధ్యమని ప్రధాని మోడీ ఎన్నికల సభల్లో చెప్పారు. నాలుగు వందల ఎంపీల బలంతో తిరిగి అధికారంలోకి రావాలన్న బిజెపి దురాశకు దేశ ప్రజలు అడ్డుకట్ట వేశారు. వున్న వాటిలోనే 60 ఎంపీ స్థానాలు తగ్గి 'లావొక్కింతయు లేదు, ధైర్యంబు విలోలంబయ్యే' అన్నట్లు మూడోసారి అధికారంలోకి రావడానికి టిడిపి, జనసేన ఎంపీల మద్ధతు అత్యంత కీలకమైంది. ఈ రాజకీయ పరిస్థితి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడుతుందని ప్రజలు ఆశించారు. ఈ సంవత్సర కాలంలో ప్రజల ఆశలకు పూర్తి భిన్నంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం నిధులు

ఇవ్వకుండా మాటలతో కాలయాపన చేస్తున్నది. నిధులు రాబట్టాల్సిన రాష్ట్ర పాలకులు మోడీ భజనలో పులకించిపోతున్నారు.

రాష్ట్ర విభజన జరిగి పదకొండు సంవత్సరాలు పూర్తయిన నేటికి ఆంధ్రప్రదేశ్ అనేక రంగాల్లో కోలుకోలేకపోతుంది. కీలకమైన వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాలు, విభజన పూర్వస్థితిని చేరుకోలేకపోతున్నాయి. ఈ పదకొండు సంవత్సరాలు కేంద్రంలో మోడీనే పాలిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం ముసుగు వేసుకుని మోడీని బలపరిస్తే, గతంలో తెలుగుదేశం, ప్రస్తుతం టిడిపి, జనసేన ప్రభుత్వాలు బిజెపి కూటమిలో చేరి సంపూర్ణంగా బలపరుస్తున్నాయి. విభజన చట్టంలో భాగంగా రాష్ట్రానికి రావల్సిన ప్రత్యేకహెూదా, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజి, కేంద్ర పరిశ్రమల స్థాపన లాంటి చట్టబద్ద హామీలను కూడా బిజెపి ప్రభుత్వం అమలు చేయలేదు. రాజధాని, పోలవరం నిర్మాణం, వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి నిధులు ఇవ్వలేదు. విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించేందుకు కేంద్ర పాలకులు అనేక పాచికలు వేస్తూనే వున్నారు. నాలుగు సార్లు శంకుస్థాపన చేసిన కడప ఉక్కు పరిశ్రమ కనీసం నాలుగు అడుగులు ముందుకు పడలేదు.

## గత ప్రభుత్వ వైఫల్యాల నుండి నేర్చుకోరా?

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు పోటీలుపడి బలపరచాయి. గత వైసిపి ప్రభుత్వం కేంద్రం మెప్పు కోసం ఉద్యోగ, కార్మిక హక్కులను కాలరాసింది. వ్యవసాయంలో కార్పొరేట్ విధానాలను అమలు చేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తెచ్చింది. పట్టణ ప్రజలపై చెత్తపన్ను, ఆస్తిపన్నుల భారం వేసింది. ఆదాని కోసం విద్యుత్ చార్జీలను పెంచింది. రూ. 1,750 కోట్లు లంచం తీసుకొని అదానీతో అవినీతికర సోలార్ ఒప్పందాలను చేసుకున్నది. స్మార్ట్ మీటర్లను తెచ్చింది. సోలార్ కంపెనీలు, కార్పొరేట్ల కోసం లక్షల ఎకరాల భూ సేకరణ చేసింది. దేశంలో అందరికంటే ముందుగా నూతన విద్యా విధానం అమలు చేయడానికి ప్రయత్నించింది. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరించిన మతతత్వ విధానాలన్నింటినీ పార్లమెంట్‌లో బలపరచింది. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేసినా కేంద్ర వినాశకర విధానాలను అమలు చేసిన ఫలితంగా ప్రజావ్యతిరేకతను కొని తెచ్చుకుంది. ఘోర ఓటమి చెందింది. జగన్ ప్రభుత్వం కన్నా తెలుగుదేశం ఏ విధంగానూ భిన్నంగా లేదని ప్రజలు భావిస్తున్నారు. అవే విధానాలను వీరూ అమలు చేస్తున్నారు.

# బిజెపికి దాసోహం

మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల, మతతత్వ విధానాలను నాడు వైసిపి చాటుమాటుగా అమలు చేస్తే, ఎన్‌డిఎ కూటమిలో చేరిన తెలుగుదేశం, జనసేన పార్టీలు బహిరంగంగా బలపరుస్తూ, రాష్ట్రంలో వేగంగా అమలు చేస్తున్నాయి. ప్రపంచబ్యాంకు అప్పు, మోడీ మెప్పు కోసం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మిక వ్యతిరేక విధానాలు వేగంగా అమలు చేస్తున్నారు. అందులో భాగంగా కార్మికచట్టాలను సవరించి 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచడం, మహిళలు రాత్రి పూట కూడా పనిచేయాలని, ఓటి (అదనపు పని) పనిగంటలను భారీగా పెంచారు. ఆదాని కోసం వైసిపి ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయకుండా ఈ సంవత్సరంలోనే రూ.15,485.36 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వేసింది. రాబోయే 25 సంవత్సరాల్లో లక్ష కోట్ల రూపాయల భారం మోపే అదానీ అవినీతికర విద్యుత్ ఒప్పందాలను కొనసాగిస్తున్నది. సోలార్ కంపెనీల కోసం లక్షల ఎకరాల భూమిని సేకరిస్తోంది. గత ప్రభుత్వ బాటలోనే అధిక ఛార్జీలతో దీర్ఘకాల ఒప్పందాలు చేసుకుంటున్నది. నాడు వ్యతిరేకించి స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి పార్టీలే స్మార్ట్ మీటర్లను నేడు షాపులు, ఇళ్ళకు బిగిస్తున్నది. పట్టణాలు, నగరాల్లో చెత్తపన్ను రద్దు చేసి విలువ ఆధారిత ఆస్తిపన్నుతో పాటు అనేక భారాలను వేస్తున్నది. గతంలాగే పాఠశాలల మూసివేత కొనసాగుతుంది. ప్రజాపంపిణీ వ్యవస్థ స్థానంలో నగదు బదిలీ అమలు చేయాలని ప్రయత్నిస్తున్నది. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి అదే రకమైన లక్ష్యంతో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ను అమలు చేస్తున్నది.కార్పొరేట్ కంపెనీలకు అతి చౌకగా విలువైన భూములను అప్పగిస్తున్నది. బిజెపి పాలిత రాష్ట్రాల్లోని బుల్డోజర్ సంస్కృతి రాష్ట్రంలోకి తెచ్చింది. వక్ఫ్ చట్ట సవరణలాంటి మతతత్వ విధానాలను కేంద్రంలో బలపరచడమే కాకుండా రాష్ట్రంలో ఆ శక్తులు బలపడడానికి కారణమవుతున్నది. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బిజెపి అండతో రాష్ట్రంలో మతోన్మాదాన్ని పెంచి పోషించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎన్నికల ముందు హామీల వరాలు కురిపించి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఖజానా ఖాళీ అని చెప్పడం ప్రజలను వంచించడమే. ముఖ్యమంత్రిగా సుదీర్ఘ పాలనా అనుభవంతో పాటు, కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుకు తప్పనిసరిగా టిడిపి, జనసేన మద్దతు అవసరమైన ప్రత్యేక రాజకీయ పరిస్థితుల్లో ఇచ్చిన హామీలను సకాలంలో అమలు చేయలేకపోవడం కూటమికి ఆత్మహత్యాసదృశ్యమవుతుంది.

# రాష్ట్రంలో పెరుగుతున్న మతోన్మాద ప్రమాదం

బిజెపి, దాని అనుబంధ సంస్థలు చాలా కాలంగా రాష్ట్రంలో విస్తరించడానికి ప్రయత్నిస్తున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఈ శక్తులకు అనేక అంశాలు కలిసి వచ్చాయి. రాష్ట్ర పునర్విభజన తర్వాత ఏర్పడిన టిడిపి ప్రభుత్వంలో బిజెపికి చెందిన నాయకులు దేవాలయ, ఆరోగ్య శాఖ మంత్రులుగా ఉన్నారు. ఆ ప్రభుత్వంలో మొదటి నాలుగు సంవత్సరాలు అధికారంలో వచ్చిన భాగస్వామ్యాన్ని ఉపయోగించుకొని రాష్ట్రవ్యాప్తంగా బిజెపిని దాని విభాగాలను విస్తరించుకోవడానికి ప్రయత్నాలు చేశారు. కొన్ని ముఖ్యమైన సామాజిక తరగతులపైన కేంద్రీకరించి రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో కొందరు నాయకుల్ని బిజెపిలో చేర్చుకున్నారు. తెలుగుదేశం బిజెపి మధ్య ఐక్యత చెడిన తర్వాత ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచడానికి బిజెపి ప్రయత్నం చేసింది అందులో భాగంగా రాయలసీమ డిక్లరేషన్, ఉత్తరాంధ్ర అభివృద్ధి రాగం అందుకుంది. మైనార్టీలు ఎక్కువగా ఉన్న రాయలసీమ ప్రాంతాల్లో వివిధ సందర్భాలను ఉపయోగించుకొని మత ఉద్రిక్తతలు పెంచడానికి ఆ సంవత్సర కాలంలో ప్రయత్నాలు జరిగాయి.

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో జగన్ మోహన్ రెడ్డి అనుసరించిన సానుకూల వైఖరిని అవకాశంగా తీసుకుని మత ఉద్రిక్తతలు పెంచారు ముఖ్యంగా అంతర్వేది రథం తగలబడినప్పుడు, రాముని విగ్రహాల ధ్వంసం, విజయవాడలో రోడ్ల వెడల్పు సందర్భంగా దేవాలయాల తరలింపు ఇలాంటి అనేక సంఘటనలును బిజెపి దాని సంఘాలు ఉపయోగించుకున్నాయి. వైసిపి ప్రభుత్వం అనుసరించిన మెతక వైఖరి ఈ శక్తులు బలపడడానికి తోడ్పడ్డాయి.

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండడంతోపాటు జనసేన పవన్ కళ్యాణ్ రూపంలో తన భావజాలాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోతున్నారు ఈ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుండి మత రాజకీయాలు రాష్ట్రంలో పెంచడానికి బిజెపి పవన్ కళ్యాణ్‌ను ఆయుధంగా ఉపయోగించుకుంటుంది. తిరుపతి లడ్డు పేరుతో రెండు నెలలుగా జరిగిన పరిణామాలు, తిరుపతిలో హిందూయేతర ఉద్యోగుల తొలగింపు, పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షలు, వక్ఫ్ చట్ట సవరణ, పహల్గాం ఉగ్రవాద దాడుల సందర్భంగా జరిగిన చర్చల్లో మత విభజనను ఉద్రిక్తతలను పెంచడానికి ఒకవైపు బిజెపి ఆర్ఎస్ఎస్ శక్తులు, మరోవైపు పవన్ కళ్యాణ్ ప్రయత్నించారు. లౌకిక పార్టీగా దేశ

రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తెలుగుదేశం నేడు రాష్ట్రంలో మత రాజకీయాలు పెరగడానికి తోడ్పడుతుంది. మరోవైపు ప్రజలకిచ్చిన హామీలు అమలు జరుగడం లేదు.

## 1. సూపర్ సిక్స్ హామీలు - అమలులో నత్తనడక

| | హామీలు | అమలు |
|---|---|---|
| 1. | నెలకు రూ.3,000లు నిరుద్యోగ భృతి, యువతకు 25 లక్షల ఉద్యోగాలు, | అమలు కాలేదు. సంవత్సరంలో ఒకో నిరుద్యోగి రూ.36,000 కోల్పోయారు. |
| 2. | మెగా డిఎస్సీ ఫైలుపై మొదటి సంతకం యువతకు 20 లక్షల ఉద్యోగాలు | నోటిఫికేషన్ ఇవ్వడానికి సంవత్సరకాలం పట్టింది. 16,437 డిఎస్సీ పోస్టులకు పరీక్షలు నిర్వహించారు. |
| 3. | స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000లు | అమలు కాలేదు. ఇద్దర పిల్లలు వున్న కుటుంబం సంవత్సరంలో రూ.30,000 లు కోల్పోయారు. |
| 4. | ప్రతి రైతుకు ఏటా రూ.20,000లు ఆర్థిక సహాయం | అమలు కాలేదు. ఈ సంవత్సరంలో రూ.10,718 కోట్లు రైతులకు అందలేదు |
| | రైతుకు గిట్టుబాటు ధరలకోసం ప్రత్యేక నిది | అమలు కాలేదు. ఈ సంవత్సరం గిట్టుబాటు ధర లేక రైతులు దివాళా తీసి అప్పులపాలవుతున్నారు. మిర్చికి 11,700 ఇస్తామని మాట తప్పారు. |
| 5. | ప్రతి మహిళకు నెలకు రూ.1,500లు (19 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వరకు) | అమలు కాలేదు. ఈ సంవత్సరంలో రూ.32,400 కోట్లు మహిళలు కోల్పోయారు |
| 6. | ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు | ఈ సంవత్సరం ఒక సిలిండర్‌కు సబ్సిడీ ఇచ్చారు. వినియోగదారులు సుమారు 3 వేల కోట్లు కోల్పోయారు |
| 7. | మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం | అమలు కాలేదు. |

విజయంలో కీలకమైన సూపర్ సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం కనీస పాస్ మార్కులు సాధించలేదు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి పెరగడాన్ని గుర్తించిన చంద్రబాబు నాయుడు కడప మహనాడులో వైకుంతపాళీ కథ చెప్పారేమో!

> *"సంక్షేమం విషయంలో ప్రజల్లో ఇంకా పూర్తిస్థాయిలో సంతృప్తి కానరావడం లేదు. పాలనను గాడినపెడుతూ 'సూపర్ సిక్స్' పథకాల అమలుకు శ్రీకారం చుట్టి ఫించను పెంపు, అన్న క్యాంటీన్లు, దీపం-2 పథకాలను ఇప్పటికే అమలు చేసినా 'సూపర్ సిక్స్'లోని మిగతా పథకాలు ఎప్పుడు అమలు చేస్తారనే ప్రశ్న వినిపిస్తోంది.*
>
> *- (ఈనాడు పత్రిక 07.06.2025)"*

రాష్ట్రాభివృద్ధికి బిజెపి రోడ్డుమ్యాప్ ఇచ్చిందని, జనసేన నాయకుడు షణ్ముఖ వ్యూహం పేరుతో యాత్ర చేసారు. ఈ సందర్భంగా ఆయన ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్ 2.0/ షణ్ముఖ వ్యూహం అని కూటమి ఎన్నికల మానిఫెస్టోలో చేర్చారు.


## 2. సూపర్ సిక్స్ 2.0/ షణ్ముఖ వ్యూహం

| | హామీలు | అమలు |
|---|---|---|
| 1. | ఇంటింటికీ రక్షిత త్రాగునీరు ప్రతి ఇంటికీ కులాయి కనెక్షన్ | అమలు కాలేదు |
| 2 | రిచ్ టూ పూర్ (పి4) పథకం | అమలు కాలేదు. 19,15,771 కుటుంబాలను గుర్తించారు |
| 3. | స్కిల్ సెన్సెస్ చేపట్టి, నైపుణ్య స్థాయిని పెంచుతాం | అమలు కాలేదు |
| 4. | సౌభాగ్య పథకం చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు, అంకుర పరిశ్రమలకు ప్రాజెక్టు వ్యయంలో రూ.10 లక్షల వరకు సబ్సిడీ. | భారీ కార్పొరేట్ పరిశ్రమలతో ఒప్పందాలు, చౌకగా భూకేటాయింపులే తప్ప, చిన్న, మధ్యతరహా కొత్త పరిశ్రమల హామీ అమలు కాలేదు |
| 5. | రాష్ట్ర స్థూల ఉత్పత్తిని పెంచడానికి పటిష్టమైన చర్యలు | నిర్దిష్ట చర్యలు ఏవీ లేవు - వ్యవసాయ, పారిశ్రామికోత్పత్తి తగ్గింది. సేవా రంగం కుదేలైంది. |
| 6. | అమరావతి నిర్మాణం, అన్ని ప్రాంతాల అభివృద్ధి | ప్రధాని రెండవసారి శంకుస్థాపన, రాజధాని చుట్టూ అభివృద్ధి జపం |

## ఈ సంవత్సరంలో అమలు చేసినవి

అధికారానికి వచ్చిన వెంటనే చేసిన మార్పుల్లో కొట్టొచ్చినట్టు కనిపించేది రహదారుల మరమ్మత్తులు, రోడ్లు వేయడం, సామాజికి పెన్షన్‌ల పెంపు, ఉచిత గ్యాస్ పంపిణీ, మెగా డిఎస్సీ నోటిఫికేషన్, అన్న క్యాంటిన్‌ల పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, మత్యకారులకు నష్టం చేసే జి ఓ నెం: 217, ఉపాధ్యాయ రంగానికి చెందిన జి ఓ నెం: 117 రద్దు.

ఈ సంవత్సర కాలంలో కేంద్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పుకు అనుమతి ఇచ్చి నిధులు ఇవ్వకపోవటం విశాఖ స్టీల్ ప్లాంట్ కు రూ.11,400 కోట్ల ప్యాకేజి ఇచ్చి అప్పులు, పన్నుల కొరకు జమ వేసుకోవటం మినహా ఏ సహాయం అందించలేదు.




కూటమి నేతలు విడుదల చేసిన ఎన్నికల ప్రణాళిక

సామాజిక పెన్షన్లు పెంచుతామని ఎన్నికల సందర్భంగా టిడిపి కూటమి ఇచ్చిన హామీ గత సంవత్సరం జులై 1 నుండి అమలులోకి వచ్చింది. పెన్షన్ మొత్తాన్ని పెంచింది.

అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 3,20,560 పెన్షన్లు తొలగించారు. గత వైసిపి ప్రభుత్వం గద్దె దిగేనాటికి రాష్ట్రంలో 66,34,372 పెన్షన్లు వుండగా, కూటమి అధికారంలోకి వచ్చిన 11 నెలల తర్వాత అంటే 2025 జూన్ 1 నాటికి 63,13,812 కు తగ్గాయి.

తొలి సంతకం చేసిన మెగా డిఎస్సీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం తర్వాత (జూన్6 నుండి)పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఏజెన్సీ (గిరిజన)లో జి.వో.నెంబర్ 3 పునరుద్దరించి స్పెషల్ డిఎస్సీ నిర్వహించ లేదు. ఆదివాసీ యువకులకు తీరని అన్యాయం జరిగింది.

ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేసారు. అంతే ప్రమాదకరమైన డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌ను అమలు చేయాలని నిర్ణయించారు.

అన్నా క్యాంటిన్‌లను 2024 ఆగస్టు 15న తిరిగి ప్రారంభించారు. గతంలో 250 వుండగా, ప్రస్తుతం 199 నిర్వహిస్తున్నారు

ఉపాధ్యాయులను తీవ్రంగా ప్రభావితం చేసిన జిఓ 117ను రద్దు చేసి, యాప్‌ల భారాన్ని కొంతమేరకు తగ్గించారు. అయితే గత ప్రభుత్వంలాగే పాఠశాల విద్యావ్యవస్థను బలహీనపరచి, కేంద్రం తెచ్చిన నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్నారు.

అంగన్‌వాడీలపై యాప్‌ల భారం పెరిగింది. వేతనాలు పెంచి న్యాయం చేస్తామన్న హామీ గాలిలో కలిసిపోయింది.

<u>చెప్పకుండా చేసిన ప్రజా వ్యతిరేక చర్యలు</u>

1. కార్పొరేట్లకు భూములు కేటాయింపు – ఉపాధి రాకున్నా, పరిశ్రమలు పెట్టకున్నా ఎలాంటి చర్యలూ లేవు.
2. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ.
3. పి3 – పి4 పేరుతో ప్రభుత్వ ఆస్తులు కార్పొరేట్లకు ధారాదత్తం.
4. కార్పొరేట్లకు వడ్డీ, పన్ను, రాయితీలు, నీరు, విద్యుత్‌పై తగ్గింపు – స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్
5. వికేంద్రీకరణ స్థానంలో అభివృద్ధి కేంద్రీకరణ – వెనుకబడిన ప్రాంతాల నిర్లక్ష్యం.
6. ప్రజలపై విద్యుత్, ఆస్తిపన్ను భారాలు. రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు
7. కేంద్ర ప్రభుత్వ వక్ఫ్ బిల్లు, నూతన విద్యా విధానం, విద్యుత్ ఒప్పందాలు, వ్యవసాయ మార్కెట్ చట్టం, లేబర్ కోడ్స్‌కు మద్దతు.

# 1. గాలిలో తేలాడుతున్న సూపర్ సిక్స్

**1.** నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అమలు కాలేదు. ఎప్పుడు అమలు చేస్తారో ప్రకటించడం లేదు. నిరుద్యోగ భృతి చెల్లించకపోవడం వల్ల ఈ సంవత్సర పాలనలో ఒకో నిరుద్యోగి రూ.36,000 నష్టపోయారు. ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. అంటే సంవత్సరానికి 4 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలి. ఈ సంవత్సరం 4 లక్షల ఉద్యోగాలు కాదుకదా అప్పటికే వున్న మూడు లక్షల చిరుద్యోగాలను రాష్ట్ర ప్రభుత్వం ఊడగొట్టింది. 2 లక్షల 60 వేల మంది వాలంటీర్లను, 15 వేల మంది బెవరేజెస్ కార్పోరేషన్ ఉద్యోగులతో పాటు, రేషన్ వాహనాల మీద ఆధారపడిన 20 వేల మంది ఉపాధిని తొలగించింది. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలు నడుపుకునే వారిని చాలా జిల్లాల్లో బలవంతాన ఖాళీ చేయించారు. మున్సిపాలిటీ, నగర కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఆప్‌కాస్ ద్వారా  పొందుతున్న వేతన విధానాన్ని రద్దు చేసి మరల పాత కాంట్రాక్టర్ల వ్యవస్థకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రూపు 2 లో వున్న 10 రకాల ఎగ్జిక్యూటీవ్ పోస్టులను గ్రూపు 1 లో కలిపివేసే ప్రయత్నం చేసారు.

విశాఖ స్టీల్ పరిశ్రమలో 4500 మంది కాంట్రాక్టు కార్మికుల్ని అక్రమంగా తొలగించారు. మిట్టల్ ఉక్కుకోసం పోర్టు, మైనింగ్ కేటాయింపులకు లాబీ చేసిన ప్రభుత్వం విశాఖ ఉక్కు అవసరాలను నిర్లక్ష్యం చేయడం.

చంద్రబాబు మెగా డిఎస్సీపై తొలి సంతకం చేసి 2024 డిసెంబరు నాటికి 16,437 పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అనేక నిబంధనలు పెట్టి ఈ సంవత్సరం మార్చి చివరిలో నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో డీఇడీ, బిఇడీ జనరల్ అభ్యర్థులకు అవకాశం లేకుండా చేసారు. గిరిజన ప్రాంతాల్లో స్పెషల్ డిఎస్సీ అమలు చేయాలనే డిమాండ్‌ను పట్టించుకోవడంలేదు.

రానున్న 11 నెలల్లో ఎనిమిదిన్నర లక్షల ఉద్యోగాలు కల్పించనున్నట్లు 2025 జూన్ 4న (ఎన్నికల ఫలితాలు వచ్చి సంవత్సరం అయిన సందర్భంగా) రాష్ట్ర మంత్రి లోకేష్ ప్రకటించాడు. ఈ సంవత్సరం 9.20 లక్షల కోట్ల విలువైన భారీ పరిశ్రమలు, 13,895 కోట్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందాలు చేసుకున్నట్లు ఆయన చెబుతున్నాడు. ఒప్పందాలు చేసుకున్న కంపెనీల్లో అత్యధికం సోలార్ కంపెనీలు. వీటిలో ఉపాధి అవకాశాలు నామమాత్రంగా వుంటాయని తెలిసి మరో మోసానికి సిద్ధపడుతున్నారు.

**2.** స్కూల్‌కు వేళ్ళే ప్రతి విద్యార్థికి తల్లి కి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలను బడికి పంపితే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున ఇస్తామన్నారు. ఒక కుటుంబంలో ఒక్క ఇంటిలో ఇద్దరు పిల్లలు వుంటే ఈ సంవత్సర కాలంలో వారికి రావలసిన రూ.30,000 లు నష్టపోయారు. ఈ పథకాన్ని జూన్ 12న ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారు.

**3.** ప్రతి సంవత్సరం రైతుకు రూ.20,000 చొప్పున ఇస్తామన్న అన్నదాత సుఖీభవ ఇప్పటి వరకు అమలు కాలేదు. దీనివల్ల ఈ సంవత్సరంలో ఇవ్వాల్సిన రూ.10,718 కోట్లు రైతులకు అందలేదు. గతంలో వున్న ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రీమియం భారం రైతులపై పడింది. 2023-24 సంవత్సరం పంటల ఇన్సూరెన్స్ రూ.1,385 కోట్లు ఇప్పటి వరకు చెల్లించలేదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు అరకొర సహాయం మాత్రమే చేసారు.

రూ. 500 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. ఈ సంవత్సరం బడ్జెట్లో రూ. 300 కోట్లను కేటాయించారు. పొగాకు, మిర్చి, పప్పుశెనగ, ఉల్లి, పత్తి, కోకో రైతులు గిట్టుబాటు ధరల కోసం రోడ్డు ఎక్కాల్సి వచ్చింది. నాన్‌జోన్ అక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇస్తామన్న హామీ అమలు కాలేదు. దాణ, మందుల ధరలు పెరగడంతో పాటు, కార్పొరేట్ కంపెనీల వల్ల పాడిరైతులు నష్టపోయారు. మిర్చి ధర పడిపోయిన నేపథ్యంలో క్వింటాల్ రూ. 11,700లు హామీ ఇచ్చారు. అదేమయిందో ఎవరికీ తెలియదు. మాటలతో మంత్రాలు వేసే చిట్కా ఎక్కువకాలం పనిచేయదు.

**4.** ఆడబిడ్డ నిధి కింద నీకు 1,500, నీకు 1,500 అంటూ విస్తృతంగా ప్రచారం చేసి మహిళల ఓట్లు పొందిన కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ఇప్పటి వరకు అమలు చేయలేదు. 19 నుండి 59 సంవత్సరాల మధ్య వున్న ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 చొప్పున సంవత్సరానికి రూ. 18,000 ఇస్తామన్నారు. రాష్ట్రంలో పించన్ పొందుతున్న మహిళలను మినహాయిస్తే కోటి 80 లక్షల మంది ఈ పథకానికి అర్హులు. ఈ హామీ అమలు కానందున ఈ సంవత్సరంలో రూ. 32,400 కోట్లు మహిళలు నష్టపోయారు.

50 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. అమలు చేస్తారో లేదో చెప్పడంలేదు.

**5.** ప్రతి సంవత్సరం మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఈ సంవత్సరానికి ఒక్కటి మాత్రమే అమలు చేసారు. సిలిండరు కావాలంటే ముందుగా డబ్బులు చెల్లిస్తే ఆ తర్వాత ఆ మొత్తాన్ని బ్యాంకు అకౌంట్‌లో వేస్తామని మెలికపెట్టారు. సబ్సిడీ డబ్బులు కొద్దిమందికి వచ్చి, మరికొద్దిమందికి రాక బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో దీపం పథకం కింద సుమారు ఒక కోటి 59 లక్షల ఇంటి గ్యాస్ కనెక్షన్లు వున్నాయి. మూడు సిలిండర్లు ఇవ్వడానికి సంవత్సరానికి రూ. 4,000 కోట్లు కేటాయించాలి. ఈ బడ్జెట్‌లో అందులో సగం కూడా కేటాయించలేదు.

**6.** మహిళలకు ఉచిత బస్సు పథకం ఇంకా అమలుకు నోచుకోలేదు. ఈ పథకం అమలు గురించి అధ్యయనం చేయడానికి వివిధ రాష్ట్రాల్లో మంత్రులు, అధికారులు

పర్యటనలు చేయడం, అమలు తేదీలను ప్రకటించడంతోనే సంవత్సరం గడిచిపోయింది.

## 2. ఫలితాలు సాధించని షణ్ముఖ వ్యూహం

**పవన్ కళ్యాణ్ షణ్ముఖ యాత్ర**

సూపర్ సిక్స్ హామీలు తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడిగా ఇచ్చినవి. ఇవి కాకుండా పవన్ కళ్యాణ్ ఎన్నికలకు ముందు వివిధ సభల్లో, వారి పార్టీ సమావేశాల్లో షణ్ముఖ వ్యూహం అమలులో భాగంగా ఇచ్చిన హామీల అమలుతీరు.

1. ఇంటింటికీ రక్షిత త్రాగునీరు, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ హామీ అమలు కాకపోగా, ఇప్పటికే రాష్ట్రంలో వున్న తాగునీటి పథకాల నిర్వహణకు నిధులు లేక నీటి సరఫరాకు తీవ్ర ఆటంకాలు వస్తున్నాయి. అలాగే గిరిజన ప్రాంతాల్లో వున్న తాగునీటి పథకాలకు అవసరమైన నిధుల్లో కొంత భాగం ఈ సంవత్సరం జూన్ 4వ తేదీ విడుదల చేసారు. జల్‌జీవన్ మిషన్ పేరుతో పెట్టిన కుళాయిలకు నీరు రావడం లేదు. ఉచితమని చెప్పి చార్జీలు మాత్రం వసూలు చేస్తున్నారు.

**పేదలను కార్పొరేట్లు ఉద్ధరిస్తాయా?**

2. రిచ్ టూ పూర్ హామీ పి 4 పథకంగా కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. ధనవంతులుగా వున్న పది శాతం మంది అట్టడుగున వున్న 20 శాతం పేద కుటుంబాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తారని ప్రభుత్వం చెబుతుంది. ఈ పథకానికి అర్హులుగా 19,15,771 కుటుంబాలను 'బంగారు కుటుంబాలు' గా గుర్తించామంటున్నారు. వీరిలో 70,272 కుటుంబాలను దత్తత తీసుకోవడానికి సంపన్నులు (మార్గదర్శులు) ముందుకు వచ్చారని ప్రభుత్వం చెబుతుంది. ప్రచార ఆర్భాటం తప్ప ఇది ఎంతవరకు అమలు అవుతుందనేది సందేహాస్పదమే. సంపన్నుల దయా, దానాల, కరుణకటాక్షాలకు పేదలను అప్పగించడం అంటే ఆ బాధ్యతల నుండి ప్రభుత్వం తప్పుకోవడమే. మోడీ విధానం అదే, దానినే రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. పేదలపై కరుణరసం కురిపించే కార్పొరేట్లు వారి కంపెనీల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం ఇవ్వరు. గొడ్డుచాకిరీ చేయించుకుంటారు. ఏ సంక్షేమమూ అమలు చేయరు. ఇలాంటి వారిని నమ్మి చంద్రబాబు పథకాలు పెడుతున్నారు.

**నిరుద్యోగులకు ఏది దారి?**

**3.** యువత నైపుణ్యాన్ని పెంచడానికి సర్వే చేస్తున్నారు. నైపుణ్యాన్ని పెంచే పని కార్పొరేట్ కంపెనీలు చేస్తాయని, సోలార్ కంపెనీలు ఇందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రభుత్వం చెబుతుంది. ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్ కాలేజీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు వేల సంఖ్యలో ఖాళీలు వున్నాయి. వాటిల్లో సరైన శిక్షణా పరికరాలు వుండడంలేదు. వీటి అవసరాలకు సరిపడ నిధులు గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం ఇవ్వడంలేదు. ప్రభుత్వం చేయాల్సిన పనిని ప్రైవేట్ కంపెనీలు ఎందుకు చేస్తాయి?

వర్క్ ఫ్రం హోమ్ అంటూ ఇంటింటి సర్వే చేసారు. ఇంటి నుండే ఉద్యోగం చేసేవారి కోసం కోవర్క్ స్టేషన్లు పెట్టి అవసరమైన ఇంటర్‌నెట్, ఇతర సదుపాయాలు కలిపిస్తామని చెప్పారు. సర్వే పూర్తి అయినా పనులు ప్రారంభం కాలేదు.

**చిన్న పరిశ్రమలకు దక్కని ఆదరణ**

**4.** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసే చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సాహిస్తామని హామీ ఇచ్చి ఆచరణలో బడా కార్పొరేట్ కంపెనీల చుట్టూ తిరుగుతున్నారు. వారు కోరిన రాయితీలు, భూములు అప్పగిస్తున్నారు. ఎక్కువ మందికి ఉపాధి కలిపించే చిన్న, మధ్యతరహా పరిశ్రమలు విద్యుత్ చార్జీల భారం, విదేశీ కంపెనీల పోటీకి మూతపడుతున్నాయి. ఉదా: బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలోని ఫ్రీకాట్ బి మిల్లు విద్యుత్ చార్జీల భారంతో 2025 ఫిబ్రవరి నుండి ఉత్పత్తిని నిలిపివేసింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని స్పిన్నింగ్ మిల్లులో విద్యుత్ బిల్లులు కట్టుకోలేక 40% మూతపడ్డాయి.

**5.** రాష్ట్రంలో స్థూల ఉత్పత్తి పెరగాలంటే కీలకమైన వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి సాధించాలి. సేవా రంగం విస్తరించడానికి అవసరమైన సౌకర్యాలు కలిపించాలి. ఒక్క సంవత్సరంలోనే వీటిన్నింటిని సాధించడం సాధ్యం కాకపోవచ్చు కానీ ఆ దిశగా ప్రభుత్వ చర్యలు వున్నాయా? అన్నది సందేహం. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయింది అందువల్ల జీఎస్టీ వసూళ్ళు తగ్గిపోతున్నాయి. గత సంవత్సరం మార్చి నాటితో పోలిస్తే ఈ సంవత్సరం 1.19 శాతం జీఎస్టీ వసూళ్ళు తగ్గాయి. దీనికి కారణాలు

ఏమిటో పరిశీలించి, వాటి నివారణకు చర్యలు తీసుకోకుండా రాష్ట్రాభివృద్ధి ఎలా సాధ్యం?

**అమరావతికి దిక్కేది?**

**6.** గత వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ అండతో మూడు రాజధానులు అంటూ రాజధాని నిర్మాణాన్ని వివాదస్పదంగా మార్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరోసారి అమరావతి రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణ పూర్తి బాధ్యత కేంద్రానిది. గత పదకొండు సంవత్సరాలుగా నిధులు ఇవ్వడంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించింది. తమపై ఆధారపడి కేంద్ర ప్రభుత్వం ఏర్పడింది కాబట్టి పోలవరంతో పాటు, రాజధాని నిర్మాణానికి ఉదారంగా సహాయం వస్తుందని కూటమి నేతలు ప్రచారం చేశారే తప్ప వచ్చిందేమీ లేదు. గతంలో సేకరించిన 34 వేల ఎకరాల భూమి కాకుండా మరో 45 వేల ఎకరాలను సమీకరిస్తున్నట్లు ప్రకటిస్తున్నారు.

అమరావతి తొలిదశ నిర్మాణానికి రూ. 77 వేల కోట్లు అవసరమని కేంద్ర ఆర్థిక సంఘానికి చంద్రబాబు ఫవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం రూ. 15,000 కోట్లు ఇచ్చినట్లు హంగామా చేసారు. అయితే ఈ మొత్తం అప్పు అని కేంద్ర పెద్దలు చావు కబురు చల్లగా చెప్పారు. ప్రపంచబ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు, కేఎఫ్‌డబ్ల్యూ, హడ్కో ల నుండి రూ. 31,000 కోట్లు అప్పు తెచ్చారు. మరో రూ. 21,000 కోట్ల అప్పు చేయడానికి సీఆర్‌డిఏకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

రాజధాని పరిధిలోని ప్రజల నుండి పన్నుల ద్వారా సమీకరించి ఈ అప్పులు చెల్లిస్తామని ప్రపంచబ్యాంకుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందుకోసం రాజధాని ప్రాంతంలో 127 చదరపు కిలో మీటర్ల పరిధిలో ఉన్న భూములను, ఆస్తులను సర్వే చేసి జియో డేటాబేస్‌లోకి తెచ్చేందుకు యూనిట్ ల్యాండ్ పార్శిల్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యుఎల్ పిఐఎన్), యూనిక్ ప్రాపర్టీ ఐడెంటిఫికషన్ నెంబర్ (యుపిఐఎన్), డిజిటల్ డోర్ నెంబర్స్ (డిడిఎన్) ద్వారా ప్రత్యేక నెంబర్లు ఇస్తారు. వీటి ద్వారా వివిధ రకాల పన్నులను రాజధాని ప్రాంత ప్రజలపై వేయనున్నారు.

## ఆదివాసీలకు అన్యాయం

జివో 3ని పునరుద్ధరించి స్పెషల్ డిఎస్సీ ద్వారా గిరిజన యువతకు 100% ఉద్యోగాలు ఇస్తామని చంద్రబాబు వాగ్దానం చేశారు. అది నెరవేర్చకుండానే మెగా డిఎస్సీకి సిద్ధమయ్యారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో డిఎస్సీని వాయిదా వేసిన ప్రభుత్వం స్పెషల్ డిఎస్సీ నిర్వహణకు సిద్ధపడలేదు. 1200 మంది తాత్కాలిక టీచర్లుగా, వేయిమంది భాషా వలంటీర్లుగా పనిచేస్తున్నా రెగ్యులర్ చేయలేదు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని (సిహెచ్‌డబ్ల్యూ) ఆశాలుగా మార్చలేదు. గ్రామాలకు రోడ్లు లేక ప్రసవాలు దారిలోనే జరిగిపోతున్నాయి. డోలీ మోతలు కొనసాగుతున్నాయి. మరోవైపు 525 కోట్లతో అదానీకోసం హైవే వేస్తున్నారు. గ్రామ సభల అనుమతి లేకుండానే హైడల్ ప్రాజెక్టులకు భూములిస్తున్నారు. అటవీ సంరక్షణ చట్టం ప్రకారం పోడు భూములకు పట్టాలివ్వకపోగా అటవీ శాఖ అఘాయిత్యాలు పెరిగాయి. 1/70 చట్టాన్ని ధిక్కరిస్తూ గిరిజనేతర సంపన్నులు బినామీ పేర్లతో వ్యాపారాలు చేస్తున్నా చూస్తూ మిన్నకుండిపోతున్నారు. ఈ చట్టాన్ని మార్చాలని టిడిపి శాసన సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఏజెన్సీ ప్రయోజనాలను, ఆదివాసీల హక్కుల్ని కాపాడటంలో ఈ ఏడాది పాలన విఫలమైంది.

## గోదాట్లో పోలవరం నిర్వాసితులు

పోలవరం నిర్వాసితులను దిక్కులేకుండా వదిలేశారు. డ్యాం నిర్మాణం ఆఘమేఘాలమీద సాగుతున్నది. డయా ఫ్రంవాల్ నిర్మాణంలో అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్లకు ఎందుకు సాయం చేస్తున్నారు. ఆగష్టులో వరదలొస్తే నిర్వాసితుల గతేమిటన్న ప్రశ్నకు పాలకులనుండి సమాధానం లేదు. ఆదివాసీలపట్ల అమానవీయంగా వ్యవహరిస్తున్నది.

## దళితులు, మహిళలపై దాడులు

ఈ ఏడాదిలో దళితులు, మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెరిగాయి. 'దిశ' స్థానంలో 'రక్ష' పేరుతో అదే స్కీం కొనసాగుతోంది. మహిళలపై అత్యాచారాలు మరింత పెరిగాయి. సంఘ వ్యతిరేక శక్తులు పెట్రేగిపోతున్నాయి. అధికార పార్టీ నాయకుల అండతో రౌడీ ముఠాలు రెచ్చిపోతున్నాయి. శాంతి భద్రతలు దిగజారిపోతున్నాయి. తెనాలిలో ముగ్గురు దళిత, మైనారిటీ యువకుల్ని బహిరంగంగా రోడ్డుపై పోలీసుల ట్రీట్‌మెంట్ పౌర హక్కుల

స్థితిని అద్దం పడుతున్నాయి. తిరుపతి, పశ్చిమగోదావరి, విజయవాడలలో చట్ట వ్యతిరేకంగా బుల్డోజర్ సంస్కృతి ప్రవేశించింది. భూమాఫియా చెలరేగిపోతున్నది. అనేక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలే భూదురాక్రమణకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ ప్రాజెక్టుల్లో కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారు. ముఖ్యమంత్రి బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేసే స్థాయికి ఎమ్మెల్యేల పని దిగజారిపోయింది.

## భారాల్లో మొదటి స్థానం

ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అధమస్థానంలో వున్న ప్రభుత్వం ప్రజలపై భారాలు వేయడంలో ప్రథమస్థానంలో వుంది. ఈ సంవత్సరంలో విద్యుత్ చార్జీల ద్వారా రూ. 15,485.36 కోట్ల భారాన్ని వేసింది. చెత్తపన్ను రద్దు చేసి రాజకీయ ప్రచారం చేసుకుంటున్న కూటమి పాలకులు పట్టణాలు, నగరాల్లో ఇల్లు, షాపులు, ఖాళీ స్థలాలకు విలువ ఆధారిత ఆస్తిపన్నును భారీగా పెంచిన విషయాన్ని మభ్యపెట్టాలని చూస్తున్నారు. నిర్మాణ అనుమతుల అతిక్రమణ పేరుతో పెద్ద ఎత్తున అపరాధ రుసుములు వేసి ప్రజల జేబులు ఖాళీ చేయడానికి జివోలు ఇచ్చారు. గ్రామాల్లో కూడా ఆస్తిపన్ను పెంచడానికి ఇంటింటి సర్వే చేస్తున్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్ళ బ్యాంకు అప్పులు రద్దు చేసి వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామన్నారు. అందుకు విరుద్ధంగా టిడ్కో లబ్ధిదారుల మీద బ్యాంకు అధికారుల ఒత్తిళు పెరిగాయి. గత ప్రభుత్వం నిర్మించిన జగనన్న ఇళ్ళు అసంపూర్తిగా వున్నాయని



గుడిసెల తొలగింపు




విద్యుత్ షాక్

సుమారు 8 లక్షల ఇళ్ళను రద్దు చేయడానికి ఈ ప్రభుత్వం నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. పేదలు నివాసం వున్న స్థలాలకు ఇంటి పట్టాలు ఇస్తామని ఎన్నికల్లో చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉండి, తిరుపతి, హిందూపురం లాంటి అనేక ప్రాంతాల్లో పేదల గుడిసెలను కూల్చివేసారు.

## ఈ ఏడాదిలో ప్రజల అప్పులు పెరిగాయి

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అప్పులు పెరిగాయి. ఆ భారాన్ని ప్రజలపై మోపారు. ఈ ఏడాదిలో సంక్షేమ పథకాల కుదింపు, ధరల పెంపు, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, నిజవేతనాలు పడిపోవడం వల్ల ప్రజలపై భారం పెరిగింది. ప్రజలు అప్పులపాలయ్యారు. మైక్రో ఫైనాన్స్, డ్వాక్రా, బ్యాంకులు, వ్యవసాయ పెట్టుబడులలో పెరగడం, వడ్డీ వ్యాపారులు, ఈ–కామర్స్, ఇఎమ్ఐ, ఇంటి రుణాలు ఇలా అనేక రూపాల్లో ప్రజలపై అప్పుల భారం పెరిగింది. గత ప్రభుత్వ బాటలోనే కూటమి ప్రభుత్వం కూడా అప్పులబాటలోనే సాగుతోంది. కేంద్రం నుండి నిధులు సాధించడంలో విఫలమవుతున్నది. కార్పొరేట్లకు రాయితీలిస్తూ సామాన్యులపై భారాలు మోపుతున్నది.

విశాఖ ఉక్కును కాపాడడంలోనూ, పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలోనూ కేంద్రంపై సరైన ఒత్తిడి తీసుకరాలేదు. రాష్ట్రానికి రావలసిన నిధులను సకాలంలో విడుదల చేయకుండా కేంద్రం అనుసరిస్తున్న వివక్షను ఈ కాలంలో నిలదీయలేదు.

## కార్పొరేట్లకు దాసోహం

అధికారానికి రాకముందు సంక్షేమం, పేదల అభివృద్ధి అంటూ కూని రాగం తీసిన టిడిపి అధికారం చేపట్టగానే “ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్”ను “స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్”గా మార్చి కార్పొరేట్ సేవలో తరించి పోతున్నారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలు నత్తనడక నడుస్తున్నాయి. పరిశ్రమలు పెట్టకపోయినా వేల ఎకరాలు కేటాయిస్తున్నారు. అదానీ అండ్ కంపెనీలకు భూమి, నీరు, అడవులు, మైనింగ్ వంటి ప్రకృతి సంపదను కట్టబెడుతున్నారు. గిరిజన గ్రామ సభల అనుమతి లేకుండానే హైడల్ పంప్డ్ స్టోరేజీ పేరుతో భూముల్ని ధారాదత్తం చేస్తున్నారు. అధిక ధరలకు

విద్యుత్ ఒప్పందాలు చేసుకుంటున్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టు, రైల్వే, బస్టాండ్‌లు ధారాదత్తం చేస్తున్నారు. పి3ని పి4గా మార్చి కార్పొరేట్‌ల చేతికి పేదరిక నిర్మూలన అప్పగించారు. వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో అంబానీ/ మెటా కంపెనీకి డేటా సోర్సును అప్పగించారు. పౌరుల ప్రైవసీని కార్పొరేట్ల చేతిలో పెట్టి వ్యాపారంగా మారుస్తోంది. సామాజిక స్వభావం కలిగిన సోషల్ మీడియా కార్పొరేట్ మీడియాగా మారిపోతున్నది. ప్రజలకు వాస్తవాలు తెలుసుకునే హక్కు లేకుండా పోతున్నది. అబద్ధాల్నే కార్పొరేట్ మీడియా ఉత్పత్తి చేసి ప్రజలను మానసికంగా తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు. సామాజిక (రీ) ఇంజనీరింగ్ పేరుతో కులాల మధ్య వైరుద్యాలను వైషమ్యాలుగా మార్చి చీలికలు పెడుతున్నారు.

## మారని పాలనా తీరు - జగన్ దారిలోనే చంద్రబాబు

"వేషము మార్చెను, భాషను మార్చెను, మోసం నేర్చెను అయినా..." అన్నట్లుగా ప్రభుత్వం మారినా గత పద్ధతులు కొనసాగుతూనే వున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే అనేక జిల్లాల్లో పెద్ద ఎత్తున ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు పెరిగాయి. భూ కబ్జాలు, దందాలు, ఫ్యాక్టరీ యజమానులను బెదరించి కాంట్రాక్టులు తీసుకోవడం కోసం అందుకోసం అధికార పార్టీ నేతలు ఘర్షణ పడడంలాంటి అనేక సంఘటనలు ఈ కాలంలో చూసాము. అవినీతి పెరిగింది. ఉన్నతస్థాయి అధికారుల్లో కొందరు అవినీతికి పాల్పడేందుకు ప్రత్యేక కార్యాలయాలు తెరిచినట్లు వార్తలు వచ్చాయి. దాదాపు అన్ని జిల్లాల్లో గంజాయి, మాదకద్రవ్యాల వాడకం పెరిగింది. గంజాయి మత్తులో మహిళల మీద అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయి. పోలీసులు హద్దులు మీరి ప్రవర్తిస్తున్న సంఘటనల్లో విచారణ చేపట్టి పౌరుల హక్కులను, చట్టాలను కాపాడాల్సిన ప్రభుత్వమే బహిరంగంగా అలాంటి వాటిని సమర్థిస్తుండడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. గత ప్రభుత్వాల కాలంలో ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఈ ప్రభుత్వం రద్దు చేయకుండా కొనసాగించడం శోచనీయం. ఇటీవల అనకాపల్లి, విశాఖపట్నంతో పాటు అనేక జిల్లాల్లో పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాలను నివారించడంలో, వాటికి కారణమైన యాజమాన్యాలను కఠినంగా శిక్షించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుంది.

కేంద్ర బిజెపితో జతకట్టిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మతతత్వ, విద్వేష రాజకీయాలు పెరగడానికి కారణమవుతుంది. తిరుపతి లడ్డు కల్తీ అంటూ రెండు నెలలు రాష్ట్రమంతటా హంగామా చేశారు. ఉపముఖ్యమంత్రి వేషం మార్చి ప్రాయశ్చిత దీక్షల పేరుతో మత కార్యక్రమాలకు తెరదీసారు. పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలంతా స్పందించి మతసమైక్య యాత్రలు, సభలు నిర్వహిస్తుంటే పవన్ కళ్యాణ్ మాత్రం మైనారిటీల మీద విద్వేషాన్ని పెంచడానికి సిద్ధమయ్యారు. ఒకే భాష పేరుతో హిందీని బలవంతంగా ప్రజలపై రుద్దడాన్ని ప్రశ్నించిన వారిపై ఆయన తీవ్రమైన విమర్శలకు దిగి బిజెపి మన్ననలను పొందుతున్నారు. పార్లమెంట్ స్థానాల డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలన్నీ వ్యతిరేకిస్తుంటే టిడిపి, జనసేన సంపూర్ణంగా బలపరచాయి. బిజెపి విధానాలను పరోక్షంగా బలపరచి మన రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి, ఒరిస్సాలో నవీన్‌పట్నాయక్ ఘోరంగా ఓడిన చరిత్ర కళ్ళముందు కనిపిస్తున్నా తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు ధృతరాష్ట్ర కౌగిలిలోకి చేరారు. ఈ పార్టీల చర్యలు అంతిమంగా రాష్ట్రంలో బిజెపి, దాని అనుబంధసంస్థలు బలపడడానికి, మతసామరస్యాన్ని దెబ్బతీసి మతోన్మాదాన్ని పెంచడానికి తోడ్పడతాయని గుర్తించాలి.

## వివిధ తరగతులకు ఇచ్చిన హామీలు- అమలు

### వ్యవసాయం

వ్యవసాయానికి రోజుకు 9 గంటల చొప్పున ఉచిత విద్యుత్తు ఇస్తామన్న హామీ రాష్ట్రమంతటా ఒకే రకంగా అమలు కావడంలేదు, స్థూలంగా రోజుకు రెండు దఫాలుగా పగలు 5 గంటలు, రాత్రి 4 గంటల చొప్పున ఇస్తున్నారు.

ఎన్నికల్లో టిడిపి కూటమి విజయంలో కీలకమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసారు. కానీ బిజెపి కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన డిజిటల్ అగ్రి మిషన్ (డ్యాం) విధానాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి అదే విధానాన్ని మరోపేరుతో అమలు చేయడం వ్యవసాయ వినాశనానికి దారితీస్తుంది.

దళారుల దోపిడిని అరికట్టడానికి ఏపీ మార్కెట్ కమిటీ యాక్ట్ ను పటిష్టంగా అమలు చేస్తామన్న హామీ అమలుకు కనీస ప్రయత్నం జరగలేదు. గతంలాగే రాష్ట్రంలోని

ప్రధాన మార్కెట్ లన్నీ దళారుల ఇష్టారాజ్యంగా వున్నాయి. గత కొద్ది నెలల క్రితం గుంటూరు లో మిర్చి రైతులు, కర్నూలులో ఉల్లి, అనంతపురం, పులివెందులలలో చీని రైతులు, ఆదోని, ఎమ్మిగనూరులలో పత్తి రైతులు, గోదావరి జిల్లాల్లో కోకో రైతులు ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పొగాకురైతులు, నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ధాన్యం, ఆక్వా రైతులు, విశాఖలో పాల రైతులు మార్కెట్ల దోపిడికి వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చి నిరసనలు చేసారు. గిట్టుబాటు ధరలు అమలు కాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పొగాకు, మిర్చి రైతుల పరిస్థితి మరింతగా దిగజారింది. గత సంవత్సరం బర్లీ పొగాకు క్వింటాల్ రూ.18,000 లు వుండగా, ఈ సంవత్సరం రూ.6,000 ల నుండి రూ.12,000 లకు పడిపోయింది. వర్జీనియా పొగాకు రూ.28 వేల నుండి 20 వేలకు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయి, గిట్టుబాటు ధరలు మాత్రం అమలు కావడంలేదు. ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి కొరకు కేటాయించిన రూ.300 కోట్ల నుండి రూ.150 కోట్లు మిర్చి కొనుగోలు కోసం కేటాయించినట్లు ప్రకటనలే తప్ప ఆచరణలో అమలు కాలేదు.

**ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీలు**



**వ్యవసాయం**

- 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా
- రాయితీతో సోలార్ పంప్‌సెట్లు - మిగిలిన విద్యుత్ ప్రభుత్వం కొనుగోలు
- సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు
- ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు
- కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి అన్ని సంక్షేమ పథకాలు అందించుట - పంటల బీమా వర్తింపు
- రైతు కూలీలకు కార్పొరేషన్ స్థాపించి రాయితీలు / సంక్షేమ పథకాల అమలు
- ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో 1000 ఎకరాలలో సేంద్రీయ వ్యవసాయం (ZBNF) చేపట్టి వారికి ఆర్థిక, సాగు, మార్కెటింగ్ అంశాల్లో తోడ్పాటు
- ప్రభుత్వ రంగంలో గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజి యూనిట్ల ఆధునీకరణ, నూతన యూనిట్ల ఏర్పాటు
- దళారుల దోపిడీని అరికట్టడానికి ఏపీయంసీ యాక్ట్ పటిష్టంగా అమలు
- డ్రిప్ ఇరిగేషన్‌కు 90% సబ్సిడీ
- రాష్ట్రంలో సెరికల్చర్‌ను ప్రోత్సహించి రైతులను ఆదుకుంటాం. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

వ్యవసాయ ఉత్పత్తులను నిలువ చేసుకునేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తామని, వున్న వాటిని ఆధునీకరిస్తామన్న హామీ అమలు చేయని కూటమి నేతలు, అందుకు విరుద్ధంగా రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో వున్న గోడౌన్లను ప్రైవేట్ వారికి లీజుకు ఇచ్చి రైతులకు అన్యాయం చేస్తున్నారు.

### గిట్టుబాటు ధరల కోసం రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

వైసిపి ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేసింది. తెలుగుదేశం ప్రభుత్వం 2024 -25 ఖరీఫ్ సీజన్‌కు ఉచిత పంటల బీమా అమలు చేస్తామని, ఇప్పటివరకు



ఎలాంటి పరిహారం రైతులకు అందించలేదు. 2023 –24 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన పంటల బీమా పరిహారం కూడా రైతులకు అందలేదు. 2024 –25 రబీ సీజన్ నుండి ఉచిత పంటల బీమా స్థానంలో రైతుల వాటా ప్రీమియం రైతులే చెల్లించాలనే విధానాన్ని తీసుకు వచ్చారు. దీనివల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయారు.

ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కొనసాగుతున్నది. నాన్ జోన్ ఆక్వా రైతులకు కూడా వర్తింప చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు కానీ అమలు చేయలేదు. విద్యుత్ సబ్సిడీ కోసం అర్జీలు పెట్టుకున్న రైతులు ఎదురుచూస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు రైతులు పెట్టుకున్న అర్జీలు సంవత్సరాలుగా పెండింగ్‌లో వున్నాయి. ఈ ప్రభుత్వం కూడా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి సరైన చర్యలు తీసుకోలేదు.

## ప్రాజెక్టులు

కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టు ను సత్వరం పూర్తి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి వారాల్లో హడావుడి చేసారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి ఇంజనీరింగ్ నిపుణులతో డ్యాంకు మరమ్మత్తులు చేయిస్తున్నారు. నిర్మాణం తిరిగి మొదటికొచ్చింది. కానీ కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడంలో పాత పద్ధతినే కొనసాగిస్తుంది. పునరావాస చెల్లింపుల్లో పెద్దగా పురోగతి లేదు. 2027 నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటనలు చేస్తున్నాడు. కేంద్రం నిధులు ఇవ్వకుండా ఇది సాధ్యంకాదు.

వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయకుండా, ఆచరణ సాధ్యం కాని, భారీ పోలవరం– బనకచర్ల ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసి రాయలసీమ

జిల్లాలకు సాగునీటి వనరులు పెంచుతామని చెప్తున్నారు. ప్రజలు కోరేదొకటి – పాలకులు చేస్తున్నది మరొకటి. ఈ ప్రాజెక్టు కోసం ప్రాథమికంగా రూ. 82,000 కోట్లు అంచనా వేశారు. నీటిని ప్రయివేటీకరించడానికి ఈ ప్రాజెక్టును "గేమ్ ఛేంజర్"గా ప్రకటించింది. దీనివల్ల నీటి వనరులపై కార్పొరేట్ ఆధిపత్యం పెరుగుతుంది.

రాయలసీమ, ఉత్తరాంధ్ర పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు గత రెండు బడ్జెట్‌లలో అందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించలేదు. వెనకబడ్డ ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఉపయోగపడే వెలుగొండ రెండో దశ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేస్తామన్నారు. ఇప్పటి వరకు అందుకు అవసరమైన నిధులను కేటాయించలేదు.

రాయలసీమ జిల్లాలకు సంబంధించిన హంద్రీనీవా కాలువను 6,800 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు పనులు  తుంగభద్ర డ్యాం గేటు పనులు నత్తనడకన సాగుతున్నాయి.

పాడి పరిశ్రమ అభివృద్ధికి పశువుల కొనుగోలు, దాణ, మందుల కొనుగోళ్లపై సబ్సిడీలు ఇస్తామన్న హామీ అమలుకు చర్యలు లేవు. పాల లీటరు ధర పెంచలేదు. బోనస్ అమలు కావడంలేదు. గోపాలమిత్ర కార్యకర్తలను తిరిగి నియమించలేదు.

## స్థానిక సంస్థలు – నిధులు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 14వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీలకు ఒకసారి ఇచ్చారు. రెండవ దఫా రూ. 1,024 కోట్లు వేస్తున్నట్లు ప్రచారం జరిగిందే తప్ప అమలు కాలేదు. పంచాయతీల అభివృద్ధి కోసం రాష్ట్ర బడ్జెట్లో 5 శాతం నిధుల కేటాయింపు హామీ ఇప్పటివరకు అమలు కాలేదు. సర్పంచుల నుండి జడ్పీ చైర్మన్‌ల వరకు గౌరవ వేతనం పెంచుతామన్న హామీ పరిస్థితి కూడా ఇదే. పట్టణాలు, గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనను ప్రభుత్వం విస్మరించింది. ఫిరాయింపులు, బెదిరింపులు, ప్రలోభాలతో అధికార దుర్వినియోగానికి పాల్పడి స్థానిక సంస్థలలో కూటమి ప్రభుత్వం అధికారాన్ని దక్కించుకోవడానికి అడ్డదార్లు తొక్కుతున్నది.

## పట్టణాభివృద్ధి

123 పట్టణాలు, నగరాల్లో 1.50 కోట్ల మంది జీవిస్తున్న పట్టణాభివృద్ధిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఆస్తిపన్ను, ఇతర భారాలు మోపడం తప్ప సౌకర్యాల కల్పనపై

దృష్టి పెట్టలేదు. స్మార్ట్ సిటీలు, అమృత్ తదితర కేంద్ర ప్రభుత్వాల పథకాల పేరుతో సంస్కరణలను అమలు చేసి ప్రయివేటీకరణ బాట చేపట్టింది. మంచినీరు, డ్రైనేజీ, పారి శుద్ధ్యం, ప్రజారోగ్యం, రోడ్లు తదితర సదుపాయాలు దిగజారాయి.

## కౌలు రైతులు

భూ యజమాని సంతకం వుండాలనే నిబంధన తొలగించి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. రైతుల అభిప్రాయాలను సేకరించారే తప్ప విధానంలో మార్పు రాలేదు. అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు మాత్రం ఇవ్వలేదు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన పంట సాగుహక్కుదారుల చట్టాన్నే ఈ ప్రభుత్వం కూడా అమలు చేస్తుంది. గ్రామాల్లో వున్న భూస్వామ్య, ధనిక రైతుల ఒత్తిళ్ళకు తలొగ్గి గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం కౌలుదార్లకు చట్టబద్ధ రక్షణ కలిపించడానికి సిద్ధపడడంలేదు. వాస్తవ సాగుదార్లుగా వున్న కౌలు రైతులకు ప్రభుత్వం నుండి అందే సబ్సిడీలు, సంక్షేమ పథకాలు, పంటల బీమా అమలు చేయడంలేదు. దేవాలయ భూములను సాగు చేసుకుంటున్న కౌలుదార్లకు చట్ట ప్రకారం అందాల్సిన బ్యాంకు రుణాలు, ఇతర సదుపాయాలు కల్పించడంలేదు.

## వ్యవసాయ కూలీలు

వైసిపి నాయకులు, భూకబ్జాదారులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని పేదల నుండి 15 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఆక్రమించుకున్నారని అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ భూములను తిరిగి పేదలకు పంపిణీ చేస్తామని కూటమి నేతలు చెప్పారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి సదస్సులు జరిపారే తప్ప, ఒక్క పేద వాడికి సెంటు భూమి కూడా తిరిగి ఇవ్వలేదు, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోలేదు. 50 సంవత్సరాలుగా అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా వున్న అసైన్డ్ చట్టాన్ని సవరించి పెద్దలకు అప్పగించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడడం పేదలకు, దళితులకు తీవ్ర అన్యాయం చేయడమే.

రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి ప్రాజెక్టులు, హైవేలు, రైల్వేలైన్లు, పారిశ్రామిక కారిడార్లు, సోలార్ పవర్ ప్లాంట్‌ల పేరుతో పేదల

సాగులో ఉన్న అసైన్డ్ భూముల్ని లాక్కుంటూ, పరిహారం ఇవ్వడంలేదు. అంతేకాకుండా జిరాయితీ భూములకు నెలకు రూ.30వేలు కౌలు చెల్లించి దళితులు సాగు చేసుకుంటున్న భూములకు లీజు ఇవ్వకుండా ద్రోహం చేస్తున్నారు.

భూసేకరణ, వ్యవసాయ పరిస్థితుల వల్ల ఈ సంవత్సరం 22 లక్షల మంది వలసలు వెళ్ళినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వివిధ అవసరాల కోసం ప్రభుత్వం సేకరించిన భూముల్లో ఉపాధి పనులు పెట్టరు, పశువులు మేపుకోవడానికి అవకాశం లేదు.

## సోలార్ విద్యుత్ పేరుతో భూదురాక్రమణ

ప్రాజెక్టుల కోసం 100 ఎకరాలకు మించి భూసేకరణ చేస్తే 2013 చట్టం ప్రకారం పునరావాసం క్రింద వ్యవసాయ కార్మికులకు రూ.5 లక్షల చొప్పున చెల్లించాలి. రాష్ట్రంలో సుమారు 5 లక్షల ఎకరాలు కేవలం సోలార్ కోసం తీసుకుంటున్నారు. ఇక్కడ లక్షలాది మంది ఉపాధి కోల్పోయి సొంత గ్రామంలో పనులు లేక సుదూర ప్రాంతాలకు వెల్లడం ఈ సంవత్సరంలో కూడ కొనసాగింది

ఆ ప్రాంతాలలో 2013 చట్టం ప్రకారం పునరావాసం చెల్లించాలని గౌరవ హైకోర్టు తీర్పు చెప్పినా గత వైసిపి ప్రభుత్వం, నేటి కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదు.

## ఉపాధి చట్టం

గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి గత 10 ఏళ్ళుగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం భారీగా నిధులు కోత విధించింది. 2021 సం॥ లక్ష 10వేల కోట్లు ఖర్చు చేస్తే నేడు 80వేల కోట్లకు తగ్గించింది. నాడు 5 కోట్ల మంది పైగా పని చేస్తుంటే నేడు 3.5 కోట్ల మందికి తగ్గిపోయారు. రాష్ట్రంలో 83 లక్షల



వలసలు వెలుతున్న కూలీలు

కుటుంబాలు గతంలో ఉపాధి పనులకు వెళ్ళగా, ప్రస్తుతం 52 లక్షల కుటుంబాలకు తగ్గిపోయింది. చేసిన పనికి కూడా నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదు. ఇప్పటికీ రూ.652 కోట్ల బకాయిలు ఉన్నాయి. కేంద్రం నుండి నిధులు రాబట్టకపోగా ఈ పనులు కూడా పేదలకందకుండా ఉద్యానవనాలు, సిమెంటు రోడ్లు, ప్రభుత్వ భవనాలకు మళ్ళించి కాంట్రాక్టర్లకు కట్టబెట్టి పేదల పొట్టగొట్టడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతుంది.

కేరళ లాగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అన్ని రకాల సహాయం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడాది గడిచినా బోర్డు ఏర్పాటు గురించి ఊసేలేదు. సంక్షేమ బోర్డు వల్ల కేరళలో 26 లక్షల మంది వ్యవసాయ కార్మికులకు పని గ్యారెంటీతో పాటు రోజు వేతనం రూ.720/-లు ఇస్తున్నారు. పిల్లల చదువులకు, పెళ్ళిల్లకు ఆర్థిక సహాయం అందిస్తుంది. మన రాష్ట్రంలో కేరళ తరహా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి.

రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047 పేరుతో వ్యవసాయ రంగంలో పూర్తిగా యంత్రాలు ప్రవేశపెడతామని ప్రకటించింది. అభివృద్ధికి ఎవ్వరు ఆటంకం కాదు. కాని యంత్రాల వల్ల లక్షలాది మంది వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, పేదలు ఉపాధి కోల్పోతారు. వీరికి ప్రత్యామ్నాయం కల్పించకుండా అభివృద్ధి చేయడం అంటే పేదలను కొట్టి పెద్దలకు కట్టబెట్టడం కాదు. కాబట్టి ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం, 2 ఎకరాలు భూమి పంపిణీ చేసి అభివృద్ధి చేపట్టాలి.

## నీడ, గూడు లేని పేదలు

భూమిలేని ప్రతి పేద కుటుంబానికి కోనేరు రంగారావు భూ సిఫార్సుల మేరకు 2ఎకరాలు భూమి ఇవ్వాలి. రాష్ట్రంలో దశాబ్ధాలుగా పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఒక ప్రక్క వీరందరికి పట్టాలిస్తామని జివో 30 ఇచ్చి మరో ప్రక్క పేదలు నివాసముంటున్న స్థలాలను పెట్టుబడిదారులకు కట్టబెట్టడానికి, బలవంతంగా బుల్డోజర్స్‌తో కూల్చివేస్తున్నారు. ప్రభుత్వ వాగ్దానం చేసినట్లుగా పట్టణాలలో 2 సెంట్ల స్థలం, గ్రామాలలో 3 సెంట్లు, నివాసమంటున్న వారికి పట్టాలు, పట్టాలున్న వారికి రూ.5 లక్షలతో ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి.

వ్యవసాయ కార్మికులకు ప్రైవేటు అప్పు 2లక్షల వరకు మాఫి చేయాలి. కూలి బందు పథకం పెట్టి ఏడాదికి కుటుంబానికి రూ.12,000 ఉచితంగా అందించాలి. గ్రామీణ

ప్రాంతంలో ప్రతి పేద కుటుంబానికి 200 రోజులు ఉపాధి పని రూ. 600/-లు వేతనం ఇవ్వాలి. పేదల భూములకు రక్షణగా ఉన్న అసైన్డ్ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించాలి.

## కార్మికులు

కూటమి పార్టీలు భారీ విజయం సాధించి సంవత్సరం రోజులైన జూన్ 4న కార్మిక చట్టాలను దుర్మార్గంగా సవరించింది. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచడం, ఇప్పటి వరకు వున్న ప్రతి ఐదుగంటల పనికి ఒకసారి గంట విరామ (భోజనం కోసం) సమయాన్ని ఆరు గంటలకు పెంచడం, ఓవర్ టైం పని గంటలను 75 నుండి 144 గంటలకు పెంచడం, మహిళలను చేత రాత్రి డ్యూటీలు చేయించుకోవచ్చు అని కార్మిక చట్టాలను సవరించారు. ఎన్నికల ముందు కార్మికులు, మహిళల గురించి మొసలి కన్నీరు కార్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ కంపెనీల ముందు ఆధునిక కార్మికవర్గాన్ని బానిసలుగా మారుస్తున్నారు.

గత వైసిపి పాలనలో జరిగిన కార్మిక, ఉద్యోగ ఆందోళనలు, సమ్మెలకు మద్ధతు ఇచ్చిన తెలుగుదేశం, జనసేన నాయకులు అధికారంలోకొచ్చిన తర్వాత కార్మికవర్గానికి అనుకూలంగా ఒక్క నిర్ణయం కూడా చేయలేదు. ఎన్నికల ముందు టీడీపీ నాయకులు విశాఖ స్టీల్ పోరాట శిబిరం, అంగన్‌వాడీ ధర్నాలు ఎక్కడ పోరాటాలు జరిగినా మేము అధికారంలోకి వస్తే కార్మికులకు న్యాయం చేస్తామని వాగ్ధానం చేశారు. ఎన్నికల అనంతరం కార్మిక పోరాటాలను విశాఖ స్టీల్‌తో సహా అన్నింటిని వివిధ రూపాల్లో అణచివేస్తున్నారు. బిల్డింగ్ కార్మికుల వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటుపై మొదటి సంతకం పెడతానన్న కార్మికశాఖ మంత్రి ఇంత వరకూ వెల్ఫేర్‌బోర్డు, కనీస వేతనాల బోర్డుల గురించి ఒక్కమాట మాట్లాడడంలేదు.

గత ప్రభుత్వం అంగన్‌వాడీ, ఆశా కార్మికులతో చేసుకున్న ఒప్పంద మినిట్స్ కు ఈ సంవత్సర కాలంలో జీఓ లు ఇవ్వకుండా



అంగన్‌వాడీ సమ్మెకు మద్దతు తెలుపుతున్న చంద్రబాబు

నాన్చుతున్నారు. పి-4 పేరుతో ధనవంతులు పేదరికంలోని ప్రజలను ఉద్ధరిస్తామంటున్న ప్రభుత్వం తమ శాఖల్లో వివిధ రకాల పనులు చేస్తున్న స్కీం మరియు కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి సిద్ధపడడంలేదు. ఫార్మా తదితర పరిశ్రమల్లో ఘోర ప్రమాదాలు జరిగినా ఒక్క యజమానిపై కఠిన చర్యలు తీసుకున్నది లేదు.

ఆంధ్ర రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటువారికి అప్పగించేందుకు కేంద్రం చేస్తున్న అన్ని చర్యలకు కూటమి నేతలు మద్ధతు ఇస్తూ కార్మికులను బలిపెడుతున్నారు. ఇప్పటికే 4,500 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారు.

ప్రజాగళం, కూటమి నేతల ఉమ్మడి మ్యానిఫెస్టోలో కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు డబ్బులు లేవని సాకులు చెబుతున్నారు. రాజధాని రెండవసారి శంకుస్థాపనకు, యోగా డే కు కోట్లు ఖర్చు చేసే రాష్ట్ర ప్రభుత్వానికి కార్మికుల వేతనాలు, సౌకర్యాలు కలిపించడానికి డబ్బులు లేవనడం మోసకారి తనం.

ఉద్యోగస్తులకు సిపిఎస్/జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపిఎస్‌ను పున:ప్రారంభిస్తామని, మెరుగైన పిఆర్‌సి, ఐఆర్ అమలు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు ఎటువంటి చర్యల్లేవు. తక్కువ జీతాలు పొందే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, కన్సాలిడేట్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చర్యలు లేవు. వాలంటీర్లకు గౌరవ వేతనం రూ. 5 వేల నుండి రూ. 10 వేలకు పెంచుతామని మ్యానిఫెస్టోలో పెట్టి అందుకు విరుద్ధంగా 2 లక్షల 60వేల మంది వలంటీర్లను ఇంటికి పంపించారు. ప్రజలందరికీ మొబైల్ వ్యాన్ ద్వారా ఇంటికే రేషన్ సరుకులు సరఫరా చేస్తున్న 20వేల మంది కార్మికుల ఉపాధి ఊడగొట్టారు.

ఇసుక పాలసీలో అవినీతి జరిగింది. భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేస్తామని భవన నిర్మాణ సంక్షేమబోర్డు పునరుద్ధరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు. కానీ ఏఒక్క బెనిఫిట్ నిర్మాణ కార్మికులకు అమలు చేయడం లేదు. కనీసం గుర్తింపు కార్డులకు కూడా నోచుకోలేదు. చంద్రన్న బీమాను అమలు చేస్తామని ప్రకటించినా ప్రీమియం చెల్లించడం లేదు.

రాష్ట్రంలో కార్మికులకు ఏడాదిగా బీమా పరిహారం చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ సంవత్సర కాలంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో సుమారు 22 వేల మంది అసంఘటిత

కార్మికులు ప్రమాదాలకు గురయ్యారు. వారిలో 5,200 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం కార్మికుల తరపున ప్రీమియం చెల్లించకపోవడంతో బీమా అమలు కావడం లేదు. ప్రమాదానికి గురైన కుటుంబాలు బీమా పరిహారం కోసం ఎదురుచూస్తున్నాయి.

ఆటో కార్మికులను ఫైన్ల పేరుతో వేధింపులకు గురిచేస్తున్న జీఓ నెం. 21ను రద్దు చేయలేదు. ముఠా కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయలేదు. రవాణా రంగంలో డ్రైవర్ల సాధికార సంస్థ ఏర్పాటు చేసి అన్ని వర్గాల డ్రైవర్లకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యా రుణాలు వంటి సంక్షేమ కార్యక్రమాల అమలు, డ్రైవర్లను ఓనర్లు చేసే లక్ష్యంతో వాహన కొనుగోళ్లకు రూ. 4 లక్షలకు పొందే రుణాలపై 5 శాతం పైబడి వడ్డీ సబ్సిడీ అమలు చేయడంలేదు. బ్యాడ్జీ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్లకు, టాక్సీ డ్రైవర్లకు, హెవీ డ్రైవర్లకు, లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందిస్తామన్న హామీ ఆచరణలో అమలు కాలేదు. వాహనాలపై పెంచిన గ్రీన్ టాక్స్ తగ్గించకపోగా కార్మికుల మీద విద్యుత్తు భారాలు విపరీతంగా పెరిగాయి. దీనికితోడు రాపిడో, ఊబర్, ఓలా లాంటి ఆన్‌లైన్ సంస్థలు ఆటో, టాక్సీ కార్మికుల కుటుంబాలను తీవ్రంగా నష్ట పరుస్తున్నాయి.

అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేస్తామని, ఆశాలకు కనీస వేతనాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీలు అమలుకు కనీసం చర్యలు లేవు. గత 20 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనంతో (నెలకు రూ. 3 వేలు) స్కూల్స్‌లో పిల్లలకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న కార్మికులను మావాళ్ళను పెట్టుకోవాలని వందలాది మందిని మెడబట్టి గెంటేశారు. వివోఏల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయలేదు. రాజకీయ వేధింపులతో తొలగిస్తున్నారు.

గత ప్రభుత్వ కాలంలో అంగన్‌వాడీల వేతనాల పెంపు, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని 42 రోజులు చారిత్రాత్మక సమ్మె చేశారు. ఆ సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి మొదలు అనేకమంది మంత్రులు, ఎంఎల్ఏలు మద్దతు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని హామీనిచ్చారు. సమ్మె ముగింపు సందర్భంగా 2024 జూలైలో ప్రభుత్వానికి, అంగన్‌వాడీలకు ఆమోదయోగ్యమైన వేతనాలు పెంచుతామని గత ప్రభుత్వం మినిట్స్ లో చేర్చింది. ఆనాడు హామీ ఇచ్చిన నేతలు అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్న వేతనాల పెంపు విషయం నేటికీ ప్రస్తావన కూడా చేయడం లేదు. గ్రాట్యూటీ అమలుకు ఇచ్చిన జీవోను

మార్పు చేయమని కోరినా చేయలేదు. చాలా జిల్లాల్లో అంగన్ వాడీ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను బెదరించి పనులనుండి తొలగించారు.

గత ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికులు 16 రోజుల సమ్మె చేసి సాధించుకున్న హామీలు అమలు కాలేదు.

షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న 50 లక్షల మంది కార్మికులకు గత ప్రభుత్వం వేతన సవరణ చేయలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరమైనా, 15 సంవత్సరాలుగా పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతన సవరణ చేయలేదనే విషయాన్ని పట్టించుకోవడంలేదు. దీని ఫలితంగా పరిశ్రమల్లో యాజమాన్యం కార్మికులకు కనీస వేతనాలు, ఎటువంటి చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయకుండా శ్రమను దోచుకుంటున్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్ యజమానుల శాఖగా మారింది. ఎటువంటి తనిఖీలు లేవు.

## ఉద్యోగులు, పెన్షనర్లు

**(1) సిపిఎస్, జిపిఎస్ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి :**

తాము అధికారంలోకి వస్తే సిపిఎస్, జిపిఎస్ విధానాలను పున:సమీక్షించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేస్తామని కూటమి నాయకత్వం ఎన్నికల సందర్భంగా ఉద్యోగులకు వాగ్దానం చేసింది. కాని, అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే జిపిఎస్ విధానాన్ని అమలు చేయాలని చూసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించడంతో దానిని అబెయన్సులో పెట్టింది. ఈలోగా కేంద్ర ప్రభుత్వం 'సిపిఎస్' విధానం బదులుగా 'యూనిఫైడ్ పెన్షన్ సిస్టమ్ (యుపిఎస్) అనే మరో కొత్త పెన్షన్ విధానం తీసుకువచ్చింది.

రాష్ట్రంలో ప్రస్తుతం ఉద్యోగులకు జిపిఎస్ గాని, యుపిఎస్ గాని ఏదీ అమలు కావడం లేదు. ఇంకా సిపిఎస్ విధానమే కొనసాగుతున్నది. ఏడాది పాలన గడచినా కూటమి ప్రభుత్వం ఉద్యోగుల పెన్షన్ విధానం గురించి ఒక్క మాట కూడా పలకడం లేదు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై ప్రభుత్వ కాలయాపన చర్యల పట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

**(2) మెరుగైన పిఆర్సి కోసం :**

రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినపుడల్లా ఉద్యోగుల పిఆర్సి ప్రస్తావన ముందుకు వస్తుంది. ఎన్నికలముందు హడావిడిగా ఐ.ఆర్. ప్రకటించడం, ఎన్నికలు ముగిసిన తర్వాత ఉద్యోగుల ప్రయోజనాలకు కోతపెట్టి పిఆర్సి అమలు చేయడం పరిపాటిగా మారింది.

తాము అధికారంలోకి వస్తే మెరుగైన పిఆర్సి ఇస్తామంటూ కూటమి నాయకత్వం ప్రకటించింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పిఆర్సి కమీషనర్ రాజీనామా చేసారు. ఏడాది గడచినా పిఆర్సి కమీషనర్ను ఇప్పటివరకు తిరిగి నియమించలేదు. పిఆర్సి కమీషన్ ఏర్పాటు చేస్తే పిఆర్సి అమలు చేసేందుకు మరో 2 సం॥లు పడుతుంది. ఈలోగా ఉద్యోగులకు ఐ.ఆర్. ప్రకటించాల్సి ఉంది. ధరల పెరుగుదల కారణంగా 29% ఐ.ఆర్. ప్రకటించాలని, ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కాని, ఇప్పటివరకు కూటమి ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదు సరికదా కనీసం ఒక్క డిఏ కూడా ఉద్యోగులకు మంజూరు చేయలేదు. దీంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

**(3) ఉద్యోగులకు, పెన్షనర్లకు బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం:**

ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఎఫ్, ఏపిజిఎస్ఐ, మెడికల్ రీయింబర్స్మెంట్, సరెండరు లీవులు తదితర బకాయిలు దాదాపు 30వేల కోట్లు మేర పేరుకుపోయాయి. ఈ దశలో తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రతీనెలా 1వ తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లిస్తామని, బకాయిలు చెల్లింపుకు తగిన ఏర్పాటు చేస్తామని కూటమి నాయకత్వం ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెగ్యులర్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నెల మొదటి వారంలోనే జమ చేస్తున్నారు. కాని, చిరుద్యోగులుగా ఉన్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు ఇప్పటికీ ఆలస్యంగానే జమ అవుతున్నాయి. కాని, ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించవలసిన పిఆర్సి, డిఏల బకాయిలు దాదాపు 17వేల కోట్లు ఇప్పటికీ పెండింగ్లోనే ఉన్నాయి. ఈ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం ప్రకటించడం లేదు. 4 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సరెండరు లీవులు బకాయిల చెల్లింపు ఊసు ఎత్తడం లేదు. జీతాల చెల్లింపుపై పెద్దగా అసంతృప్తి లేకున్నా బకాయిలు చెల్లింపు విషయంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

# మహిళలు

సూపర్ సిక్స్ పేరిట టీడీపీ ఎన్నికల వాగ్దానాలను ఇంటింటికీ ప్రచారం చేసింది. 18-59 సంవత్సరాల వయసు కలిగిన మహిళలకు "ఆడబిడ్డ నిధి "పథకం కింద నెలకు రూ. 1500 చొప్పున ఇంటిలో ఎంతమంది మహిళలు ఉంటే అంతమందికీ ఇస్తానని వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిన ఈ పథకం అమలుకు నోచుకోలేదు. ఎప్పుడు అమలు చేస్తారో చెప్పడంలేదు. డ్వాక్రా మహిళల రుణాలను రద్దు చేస్తానని 2014 లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ అమలు చేయకుండా అప్పట్లో దగా చేసింది. 2025 ఎన్నికల ప్రణాళికలో 10 లక్షల రుణం వరకు జీరో వడ్డీ రాయితీ ని కల్పించి ప్రభుత్వం జమ చేస్తుందని హామీ ఇచ్చారు. ఇంతవరకు వడ్డీ రాయితీ గురించి మాట్లాడడంలేదు. ఇప్పటి వరకు వారికి న్యాయం జరగలేదు.

గతంలో అమలు జరిగిన కళ్యాణలక్ష్మి పథకం కూడా ఇప్పుడు అమలు కావడం లేదు. చంద్రన్న పెళ్లి కానుక పేరుతో వివాహం చేసుకునే పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు లక్ష రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకు ఆ పథకం అమలుకు నోచుకోలేదు. గతంలో ఇచ్చిన సంక్రాంతి కానుక, రంజాన్ తోఫాల ను పునరుద్ధరించలేదు. రేషన్ దుకాణాల్లో ఇస్తామన్న కిలో కందిపప్పు, వంట నూనె అన్ని చోట్లా అమలు కాలేదు. నగదు బదిలీ పేరుతో రేషన్ బియ్యాన్ని నిలిపివేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది.

**విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు - ఊరూరా బెల్ట్ షాపులు:**

గతంలో అమలైన ప్రభుత్వ మద్యం షాపుల స్థానంలో తిరిగి ప్రైవేట్ షాపులు వచ్చాయి. రాష్ట్రంలోని 3,396 మద్యం షాపుల టెండర్లను కూటమి నేతలు, వారి అనుచరులు దక్కించుకున్నారు. మద్యం నియంత్రణకు, బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా ప్రతిపక్షంలో అనేక మాటలు మాట్లాడిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 55 వేల బెల్ట్‌షాపులు తెరిచారు. మద్యం అమ్మకాల ద్వారా ఎక్సైజ్ శాఖకు 2024-25లో రూ.24 వేల



మద్యం వేలాలకు వ్యతిరేకంగా ఆందోళన

కోట్లు ఆదాయం రాగా, 2025-26లో రూ. 36 వేల కోట్లు రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పండుగలు, ఉత్సవాలు, జనవరి 1 లాంటి ప్రత్యేక సందర్భాల్లో ప్రతి సంవత్సరం రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు పెరుగుతున్నాయి.

మద్యాన్ని నియంత్రిస్తామని చెప్పిన కూటమి నేతలు అందుకు విరుద్ధంగా మద్యం అమ్మకాలను పెంచారు.

## యువత సంక్షేమం - ఉపాధి

ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి పోస్టులు భర్తీ చేస్తామన్న హామీ ఈ సంవత్సరం జనవరి పోయి ఆరు నెలలు అవుతున్నా జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్సీ విడుదల చేయకపోవడంపై ఆ ప్రాంత యువత నష్టపోతున్నారు.





డిఎస్సీ నోటిఫికేషన్ కోసం యువత ఉద్యమం

రాష్ట్ర విభజన చట్టంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజి (బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ) అమలు చేయాల్సివుంది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో జిల్లాకు రూ. 50 కోట్ల చొప్పున మూడు సంవత్సరాలు మాత్రమే ప్రత్యేక నిధులు ఇచ్చి ఆ తర్వాత కేంద్రం నిలిపివేసింది. వెనుకబడిన ప్రాంతాలకు కేంద్రం ప్రత్యేక సహాయం చేయకుండా రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించలేదు. కేంద్రం నుండి నిధులు రాబట్టడంలో గతంలో వైసీపీ, ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.

## కార్పొరేట్లకోసం ప్రభుత్వ విద్య బలి

### ఊరి బడిని దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

పాఠశాల విద్యలో ప్రపంచ బ్యాంకు ప్రవేశంతో పాఠశాల వ్యవస్థ చిన్నాభిన్నం అయింది. అందరికీ అక్షరాస్యతా లక్ష్యాలను చేరుకోలేక పోయింది. బలమైన పాఠశాల వ్యవస్థను ఏర్పాటును విస్మరించింది. గత ప్రభుత్వం విద్యారంగాన్ని విధ్వంసం చేసిందని,



ఎన్నికల ప్రణాళికలో యువత సంక్షేమం

విద్యారంగాన్ని గాడిలో పెడతామని టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు జట్టు కట్టి గద్దెనెక్కాయి. దీనికి కారణమైన జిఓ 117 ను రద్దు చేస్తామని కూటమి నేతలు ఊరువాడ చెప్పారు. జి ఓ రద్దు చేయకపోగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయడానికి సిద్ధపడింది. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పేరుతో కొత్తగా 19, 20, 21 జీవోలు తీసుకొచ్చింది. తొమ్మిది రకాల పాఠశాలల పేరుతో వ్యవస్థలో మార్పు చేస్తున్నది. వీటిని అమలు చేస్తే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కాకపోగా బలహీనపడే అవకాశం ఉంది. శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు (పి.పి1, పి.పి2), ఫౌండేషన్ స్కూళ్లు (పి.పి1, పి.పి2, ఒకటి, రెండు తరగతులు), బేసిక్ ప్రైమరీ స్కూళ్లు (పి.పి1, పి.పి2, 1 నుంచి 5 తరగతులు), మోడల్ ప్రైమరీ స్కూళ్లు (పి.పి1, పి.పి2, 1 నుంచి 8 తరగతులు), ప్రాథమికోన్నత పాఠశాలలు (6 నుంచి 10 తరగతులు), ఉన్నత పాఠశాలలు (1-10 తరగతులు), హైస్కూల్ ప్లస్ (6-12 తరగతులు), హైస్కూల్ ప్లస్ (1-12 తరగతులు). 2025-26 విద్యా సంవత్సరంలో అమలు చేయనున్నారు. అంటే నూతన జాతీయ విద్యా విధానం ప్రతిపాదనలలో భాగమే.

పాఠశాలల విలీనం వలన టీచర్ల సంఖ్యను తగ్గించవచ్చు. పాఠశాలల సంఖ్యను తగ్గించవచ్చు. బడ్జెట్లో కేటాయింపులు తగ్గించవచ్చు. కనుకనే అనేక రకాల పాఠశాలలను తీసుకొచ్చింది. ఈ విధానం వలన రాష్ట్ర విద్యారంగం సంక్షోభంలో మరింత కూరుకుపోతుంది.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు మాతృభాషలో విద్యాబోధన గురించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పాత విధానాన్నే కొనసాగిస్తున్నారు.

**ఎయిడెడ్ విద్యా సంస్థలు**

గతంలో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన రెండూ పార్టీలు గత ప్రభుత్వ ఎయిడెడ్ ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకించారు. నేడు అధికారంలోకి వచ్చిన కూటమి

ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి స్వయంగా గత జిఓలను చించివేస్తామని వాటిని మరల పున:రుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. వాటిపై నేటి వరకూ ఉసేలేదు.??

**జిఓ77 పున:రుద్ధరణ**

గతంలో ప్రతిపక్షంలో నారా లోకేష్ తన యువగళం పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే 77 జిఓ రద్దు చేసి పీజి చదువుకునే విద్యార్థులందరికి ఫీజురీయింబర్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సంవత్సరం అయినా అమలుకు నోచుకోలేదు.

## సామాజిక తరగతులు

## ఉద్యోగాల్లేవు - స్మశానాలకు సైతం దిక్కులేదు

**ఎస్సీ, ఎస్టీ సంక్షేమం**

ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలకు 50 ఏళ్ళకే పెన్షన్ మంజూరు ప్రక్రియపై కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అమలు కోసం ఇంకా అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చెయ్యలేదు. దీన్ని గురించి చర్చేలేదు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ విషయంలో ఏలాంటి ప్రకటన రాలేదు. శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాల జారీపై ప్రభుత్వం నుండి ఏలాంటి ప్రకటన లేదు. గత ప్రభుత్వం రద్దు చేసిన పథకాల పునరుద్ధరణపై ఏలాంటి ప్రకటన లేదు. అంబేద్కర్ విదేశీ విద్య పునరుద్దరించినా అమెరికా ట్రంప్ విధానాల వల్ల వీసాలు రాక ఈ స్కీం నిరుపయోగమైంది.

ఈ సంవత్సరం ఎస్ సి కార్పోరేషన్ ద్వారా 45 సంవత్సరాల లోపు యువతీ యువకులకు వివిధ పథకాలకు సుమారు 16 వేల కుటుంబాలకు స్వయం ఉపాధి కోసం రాయితీ రుణాలు కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. ఆన్లైన్ లో అప్లై చేసుకోమన్నారు. 5 సంవత్సరాల నుండి ఎస్ సి కార్పోరేషన్ నుండి ఏలాంటి పథకాలు లేనందున ఈసారి ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ రాగానే సుమారు 7 లక్షలు పైగా రుణాలకు ఆన్లైన్ లో నమోదు చేసుకున్నారు. దీన్ని గమనించిన ప్రభుత్వం ఇంకా పెరుగుతున్న రీత్యా ఆన్లైన్ రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది.

కేంద్ర ప్రభుత్వం విడుదల చెయ్యాల్సిన ఎన్ఎస్ఎఫ్‌డిసి, ఎన్ఎస్ఎఫ్‌యుడిసి పథకాలు ఇంతవరకు విడుదల చెయ్యలేదు. గత మూడు సంవత్సరాల నుండి ఈ నిధులు విడుదల చెయ్యలేదు.

స్మశానవాటికలకు స్థలం కేటాయింపు కోసం కూటమి ప్రభుత్వం ఏలాంటి చర్యలు ప్రారంభించలేదు.

**అభద్రతాభావంలో మైనారిటీలు :**

ముస్లీంలో ఎక్కువ మంది వృత్తిదారులు, చిన్న వ్యాపారులు. వీరి సంక్షేమానికి మైనారిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి జీరో వడ్డీతో రూ.5 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు అలాంటి కార్పొరేషన్ ఏర్పాటుకు కనీస ప్రయత్నం చేయలేదు. నూర్ భాషా కార్పొరేషన్ హామీ కూడా అమలుకు నోచుకోలేదు. ముస్లీం మైనారిటీలకు 50 ఏళ్ళకే పెన్షన్ హామీ అమలు కాలేదు. ఈద్గాలకు, కబరిస్తాన్‌లకు స్థలాల కేటాయిస్తామన్న హామీ అమలు చేయకపోగా, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ చట్టాన్ని బలపరచి మైనారిటీలకు కూటమి ప్రభుత్వం తీరని ద్రోహం చేసింది. ఈ చట్టాన్ని మన రాష్ట్రంలో అమలు చేయడానికి సన్నాహాలు ప్రారంభించింది ఉదా: గుంటూరులో 300 ఎకరాల వక్ఫ్ భూమిని జనరల్ భూమిగా మార్చడానికి డిఆర్‌ఓ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్ఆర్ఐ ఆసుపత్రి దగ్గరలో అత్యంత ఖరీదైన 70 ఎకరాల భూమిని ఇలా కాజేయాలని ప్రభుత్వం చూస్తుంది.

మసీదుల నిర్వహణకు ప్రతి నెల 5వేలు, హజ్ యాత్రకు వెళ్ళే ఒక్కో ముస్లింకు రూ.1 లక్ష వరకు ఆర్థిక సహాయం లాంటి హామీలు అమలు కాలేదు. ఉర్దూ అకాడమీ మరియు మైనార్టీ కమీషన్ పదవులు భర్తీ చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వందకు పైగా కార్పొరేషన్‌లు, మార్కెట్ కమిటీల చైర్మెన్ పదవులను నియమించింది. వీటిల్లో మైనారిటీలకు చెందిన సంస్థల్లో తప్ప ఇతర ఏ కార్పోరేషన్లలో ఒక్క ముస్లీంను కూడా నియమించలేదు. రంజాన్ తోఫా లాంటి వాటికి నిధులు విడుదల చేయలేదు.



స్పెషల్ డిఎస్సీ కోసం గిరిజన జీపుయాత్ర

క్రిస్టియన్స్ సంక్షేమం కోసం మిషనరీస్, ప్రాపర్టీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు, జెరుసలెం యాత్రికులకు ప్రత్యేక సహాయం చేస్తామని ఎన్నికల ప్రణాళికలో చెప్పి సంవత్సరమైనా వాటి అమలు గురించి పట్టించుకోలేదు.

## బి.సి.సంక్షేమం

సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేతి వృత్తిదారులకు, బీసీలకు ఇచ్చిన హామీలు ఏమీ అమలు జరగలేదు. మాటలేమో కోటలు దాటుతున్నాయి... చేతులు మాత్రం గడప దాటలేదు అన్న సామెతగా ఉన్నది, బీసీలు వృత్తిదారులందరికీ రక్షణ చట్టం తెస్తామని చెప్పిన మాట 8 మంది మంత్రులతో కమిటీతో సరి. ఒక్కడుగు ముందుకెయ్యలేదు. ఇప్పటికీ కొన్ని సామాజిక వృత్తుల్లో ఉన్న వృత్తిదారుల పైన దాడులు కొనసాగుతూనే ఉన్నవి, బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లలో లక్షన్నర కోట్ల రూపాయలు, సంక్షేమ అభివృద్ధికి ఖర్చు చేస్తామని చెప్పిన మాటలు బీసీ సబ్ ప్లాన్ రూపమే లేదు. బడ్జెట్లో బీసీల కోసం 47 వేల కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పిన మాటలే తప్ప సంక్షేమానికి అభివృద్ధికి ఖర్చు చేసింది ఏమీ లేదు, ఏ ఒక్క పేద వృత్తిదారుడికి ఏ రూపంలోనూ మేలు జరగలేదు.

## సంక్షోభంలో చేతి వృత్తులు

వృత్తిదారులకు స్వయం ఉపాధి ద్వారా 10 వేల కోట్లతో ఉపాధి అవకాశాలు హామీ ఈ సంవత్సర కాలంలో ఒక్క వృత్తిదారుడికి కానీ వాళ్ళ కుటుంబంలో ఒక బిడ్డకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. చేనేత కార్మికులకు జీఎస్టీ రియంబర్స్ చేస్తామన్న మాట అమలు జరగలేదు.

మద్యం షాపుల్లో గీత కార్మికులు 10శాతం కేటాయింపు డబ్బులు ఉన్న ఎమ్మెల్యే మనుషులకే తప్ప గీత కార్మికులకు దక్కింది ఏమీ లేదు. మత్స్యకారులకి వేట నిషేధ సమయంలో ఇస్తానన్న 20 వేల రూపాయలు వేట కెళ్ళి మత్స్యకారులందరికీ ఇవ్వకుండా కొద్దిమందితో సరిపెట్టారు. వడ్డెర వృత్తిదారులకు క్వారీల్లో 15 శాతం సీనరీ చార్జీలు మినహాయింపులు ఏమీ జరగలేదు. రజక వృత్తిదారులకు దోబిఘాట్స్ నిర్మాణాలకు ప్రోత్సాహం విద్యుత్ చార్జీల రాయితీలు ఏమి ఇవ్వలేదు, జీవో నెంబర్ 343 ప్రకారం పూర్తి చెరువులో దోబీ ఘాటు స్థలాల పైన పూర్తి హక్కు రజకులకే అన్న మాట ఏమీ జరగలేదు, జీవో నెంబర్ 27 ప్రకారం దోబీ పోస్టులు భర్తీ చేసి రజకులకు ఉపాధి కల్పిస్తా అన్న మాటే లేదు. అన్ని వృత్తుల్లో ఉన్న వృత్తిదారులకు ఆదరణ పథకం (3) 5 వేల కోట్లతో అధునాతనమైన పనిముట్లు ఇస్తామని, బడ్జెట్లో చెప్పిన మాట 1000 కోట్ల రూపాయలు ఇప్పటివరకు ఒక్క రూపాయి ఖర్చు పెట్టింది లేదు. అధునాతనమైన యంత్రాలు


ఇచ్చింది లేదు, గత ప్రభుత్వం 12 రకాల వృత్తుల్లో ఉన్న సేవా వృత్తిదారులకు సహకార సంఘాల ఫెడరేషన్లు పూర్తిగా రద్దుచేసి, లక్షలాదిమంది వృత్తిదారులకు అన్యాయం చేసింది. కులాల వారి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజకీయ నాయకులకు ఉపాధి చూపించిందే తప్ప వృత్తిదారులకు మేలు చేసింది ఏమీ లేదు.

ఆర్యవైశ్యుల్లోని చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు ఇస్తామన్నారు. వేద విద్యను అభ్యసించి నిరుద్యోగుల వున్న అర్చకులకు నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతి అమలు చేయలేదు. కాపుల సంక్షేమం కోసం ఐదేళ్ళలో కనీసం రూ. 15 వేల కోట్లు అంటే సంవత్సరానికి రూ. 3 వేల కోట్లు కేటాయిస్తామన్నారు. ఈ సంవత్సరం అలాంటి కేటాయింపులు చేయలేదు.

మాజీ సైనికోద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ హామీ అడ్రసు లేదు.

## ఉత్తరాంధ్ర అభివృద్ధి ఎక్కడ?

ఉత్తరాంధ్రలో ప్రధాన వృత్తిదారులయిన మత్స్యకారులకు ఉపాధి గల్లంతయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు చేస్తోంది. వివిధ ప్రాజక్టుల పేరున అనకాపల్లి జిల్లా నక్కపల్లి నుండి శ్రీకాకుళం జిల్లా మూలపేట వరకు తీరప్రాంతమంతా బలవంతపు భూసేకరణకు పూనుకుంటోంది. ఉద్దానం ప్రాంతంలో ప్రజాభీష్టానికి భిన్నంగా కంటైనర్ ఎయిర్ పోర్టు ఏర్పాటు చేస్తామని భూసేకరణకు పాల్పడుతోంది. అదే సందర్భంలో భావనపాడు, రాజయ్యపేట ఫిషింగ్ హార్బర్లు, గతంలో హామీ ఇచ్చినట్లు గంగవరం వద్ద, మిగిలిన ప్రదేశాలలలో ఫిషింగ్ జెట్టీలు మాత్రం ఏర్పాటు చేయడం లేదు. కొవ్వాడలో ప్రమాదకరమైన అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో ముందుకు పోతోంది. ఉత్తరాంధ్రలో వస్తున్న పరిశ్రమలన్నీ కాలుష్య తరహా పరిశ్రమలే. దీనివల్ల తీవ్ర పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని గ్రామాల ప్రజలు తమను ఖాళీ చేయించమని, పునరావాసం కల్పించమని డిమాండు చేస్తున్నారు. సముద్ర జలాలు కలుషితమవడంతో చేపల వేట కష్టతరమయింది. గిరిజన


యువత సంక్షేమం

- మెగా డీయస్సీ, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్
- ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి, ఉద్యోగ కల్పనకు ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ జోన్‌ల ఏర్పాటు
- అత్యధిక ఉద్యోగ కల్పన చేసే ఎంఎస్‌ఎంఈ సెక్టార్‌కు ప్రోత్సాహకాలు
- మూతపడిన ప్రతి నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని పునఃప్రారంభం-విస్తరణ
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగాలు కల్పిస్తాం
- క్రీడలు : ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాలు అభివృద్ధిపరిచి రాష్ట్ర యువతను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతాం. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు రాష్ట్రాన్ని వేదికగా మారుస్తాం
- డిజిటల్ లైబ్రరీలు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరీక్షలకు ప్రిపేర్ కావడం కోసం డిజిటల్ లైబ్రరీల స్థాపన
- NDA ప్రభుత్వం తెచ్చిన 10 శాతం EWS రిజర్వేషన్లను అమలు చేస్తాం. ప్రతి 5 ఏళ్లకు ఒక సారి ఆర్థిక సర్వే చేసి రిజర్వేషన్లు అమలు చేస్తాం.

ఎన్నికల ప్రణాళిక

యూనివర్శిటీకి ఇంత వరకు భవన నిర్మాణం, క్యాంపస్ పూర్తి కాలేదు. పాడేరు మెడికల్ కాలేజీ ప్రారంభం కాలేదు.

గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న 10.39 శాతం వాటాను కూడా అదానీ సంస్థకు గత ప్రభుత్వం అమ్మేసి, మొత్తం 2852.26 ఎకరాల భూమిపై సర్వ హక్కులు దారాదత్తం చేసింది. ఈ ప్రభుత్వం దాన్ని పునఃపరిశీలించాలని వివిధ సంస్థలు కోరినా, కనీసం పరిగణన లోనికి కూడా తీసుకోలేదు. దీర్ఘ కాలంగా పెండింగులో ఉండి, వీరి ప్రభుత్వమే సృష్టించిన విశాఖ జిల్లాలోని పంచగ్రామాల భూ సమస్య, గాజువాక ఇనాం భూ సమస్యలపై ప్రకటనలే కానీ, పరిష్కారం మాత్రం చేయడం లేదు

**ఆర్థిక రాజధానిగా విశాఖ పట్నం !**

విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 2014-2019లో విశాఖపట్నం ఆర్థిక రాజధాని గా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అయితే, ఆనాటి హామలు అమలుకు నోచుకోలేదు. ఎంత వరకు అమలయ్యాయో పరిశీలిస్తే నేడు కూటమి నేతలు ఇస్తున్న హామీల అమలు ఎలా వుంటుందో అర్థమవుతుంది.

## 1. వివిధ ప్రాజక్టుల నేటి స్థితి (2024-25)

1. ఫిన్ టెక్ వ్యాలీ వైజాగ్ - 2016 ఫిన్ టెక్ వేలీ, వైజాగ్, 2016- విశాఖను ఫిన్‌టెక్ హబ్‌గా అభివృద్ధి చేయడం లక్ష్యం. ప్రారంభంలో హడావుడి చేసినంతగా కొనసాగింపు లేదు. ఇందులో ప్రధాన భాగస్వాములుగా Visa, Mastercard, Thomson Reuters, Covalent Fund వంటి అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు జరిగాయి ప్రారంభంలో 25కి పైగా కంపెనీలు కార్యాలయాలు ప్రారంభిస్తున్నట్లు ప్రచారం జరిగింది. క్రమంగా కంపెనీలు వెనక్కి తగ్గాయి.
2. మిలీనియం ఐటి టవర్స్- 2019లో - ఆర్భాటంగా ప్రకటించిన ఐటీ కంపెనీలకు కార్యాలయ ప్రాంగణం నిర్మాణం పూర్తయ్యింది. అయితే పరిశ్రమలు రాలేదు. ప్రారంభంలో 5,000 ఉద్యోగాల అవకాశాలు కల్పించాలనే లక్ష్యం నెరవేరకపోగా నిర్మించిన భవనాలన్నీ నేడు ఖాళీగా ఉన్నాయి.
3. మేడ్ టెక్ జోన్ 2016 - వైద్య పరికరాల తయారీ కేంద్రం. 270 ఎకరాలు కేటాయించారు. ప్రస్తుతం 14 పరిశ్రమలే నడుస్తున్నాయి. వాటిలో కూడా సిరంజీల వంటి చిన్న ఉత్పత్తి కంపెనీలే ఎక్కువ.

4. వైజాగ్ – చెన్నయ్ కారిడార్– 2015 – పారిశ్రామిక అభివృద్ధికి ఉద్దేశించ బడింది. అయితే ఈ పేరున పెద్ద ఎత్తున భూసేకరణ జరుగుతోంది. తప్ప సాధించిన అభివృద్ధి లేదు.
5. వైజాగ్ మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదన– 2017 – నగర రవాణా వ్యవస్థ మెరుగుదల లక్ష్యం. వాస్తవంగా ఇది రాష్ట్ర పునర్విభజన చట్టంలో భాగం. అయితే నేటికీ ప్రతిపాదనల స్థాయిలోనే ఉంది. కేంద్ర ప్రభుత్వం దీనికి నిధులు ఇవ్వడానికి నిరాకరించింది. గత రాష్ట్ర ప్రభుత్వం తామే నిర్మిస్తామని ప్రకటించింది. అయితే ముందుకు సాగలేదు. నేడూ అదే స్థితి.
6. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం– ప్రతిపాదన 2015లో బలవంతంగా భూసేకరణ చేశారు. కేంద్ర మంత్రి ఇక్కడవారే కావడంతో ప్రత్యేక శ్రద్ధ పెట్టామని చెబుతున్నారు.
7. ఆర్ కె బీచ్ సుందరీకరణ– 2016లో టూరిజం అభివృద్ధి లక్ష్యం. అయితే, ఇక్కడ 13 ఎకరాల ఎపి ఐఐసి భూమిని, తాజాగా లులు మాల్ కు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే గాని జరిగితే అది ఒక పెద్ద కార్పొరేట్ వ్యాపార కేంద్రంగా మారుతుంది.
8. రుషికొండ నాలెడ్జ్ సిటి – 2016లో విద్య, టెక్నాలజీ కేంద్రంగా అభివృద్ధి, గ్లోబల్ విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలను ఆకర్షించడం, టెక్ కంపెనీలకు ప్రాధాన్యత కలిగిన వాతావరణం అందించడం, విశాఖను విద్యా, టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడం వంటివి లక్ష్యాలు. అయితే ప్రారంభ దశలోనే ఆగిపోయింది. నిర్మాణం ఇంకా ప్రారంభమే కాలేదు.
9. Andhra University Revamp ప్రతిపాదన– విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ స్థాయి మద్దతు యూనివర్సిటీ స్థలాలను అభివృద్ధి పేరున ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలని గతంలో ప్రయత్నం జరిగింది. నేడూ మరలా అవే ప్రయత్నాలు మొదలయ్యాయి.
10. తర్లువాడలో గూగుల్ యూనివర్శిటీ ప్రతిపాదన– 2023లో పునరుద్ధరణ: తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు 200 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ప్రాజెక్టు ఇంకా ప్రారంభ దశలో ఉంది. 2024 డిసెంబరులో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత, ప్రాజెక్టు ప్రణాళికలు ప్రారంభమయ్యాయి

11. ఎంఎస్ఎంఈ పరిశ్రమలు– కృష్ణాపురం: పద్మనాభం మండలంలోని కృష్ణాపురంలో 22 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ ల నిర్మాణం ప్రతిపాదించబడింది. అయితే ఇంకా నిర్మాణమే ప్రారంభం కాలేదు.
12. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ – "ది డెక్": సిరిపురం జంక్షన్‌లో నిర్మించిన 12 అంతస్తుల "ది డెక్" భవనంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని ప్రకటించారు. మరలా వేరే ప్రదేశంలో ఈ సంస్థకు భూమిని కేటాయించారు. దీనితో ఇది సందిగ్ధంలో పడింది.

తదితర ప్రాజెక్టులు కాగితాలపైనే మిగిలిపోతున్నాయి. అమలుకు నోచుకోవడం లేదు.

**2. చెత్తబుట్టలోకి రాష్ట్ర విభజన చట్టం:**

ఆంధ్ర రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి పేకేజీ, విశాఖలో మెట్రో రైల్, ప్రస్తుత విజయనగరం జిల్లా మెంటాడ వద్ద గిరిజన యూనివర్సిటీ, అనకాపల్లి జిల్లా సబ్బవరం వద్ద పెట్రోలియం యూనివర్సిటీ, విశాఖ జిల్లా గంభీరం వద్ద ఐఐఎం వంటి విద్యా సంస్థలు, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు కావాలి.

అయితే వీటిలో ఐఐఎం ఒక్కటే స్వంత భవనాల నుండి పని చేస్తోంది. ఇక్కడ కూడా పూర్తి స్థాయి శాశ్వత  సిబ్బంది లేరు.  మిగిలిన రెండు విద్యా సంస్థలు పరిమిత స్థాయిలో తాత్కాలిక భవనాల నుండి పని చేస్తున్నాయి. ఇంకా నిర్మాణాలు ప్రారంభ దశలోనే ఉన్నాయి.

## పట్టాలు తప్పిన రైల్వే జోన్

విశాఖ రైల్వే జోన్ ఏర్పాటులో తీవ్ర జాప్యం జరిగి, 11 ఏళ్ల తరువాత ఈ ఏడాదే దీని నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. కానీ ఇంత వరకు గెజిట్ నోటిఫై చేయలేదు. తాజాగా జనరల్ మేనేజర్ ను నియమించారు. వాస్తవంగా తాత్కాలిక భవనాల నుండి ప్రత్యేక జోన్ కార్యక్రమాలు నిర్వహించవచ్చు. అయితే నిర్మాణం పేరున ప్రభుత్వం ఇంకా జాప్యం చేస్తోంది. ఆ జోన్ పేరున వందేళ్ళకు పైగా చరిత్ర కలిగిన విశాఖపట్నం రైల్వే డివిజన్ ను ఈ ప్రాంత ప్రజల అభీష్టానికి భిన్నంగా ఎత్తేయాలని నిర్ణయించారు.

**3. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన ఈ ఏడాది కాలంలో ఈ పరిశ్రమ పరిస్తితి మరింత విషమించింది. ఆర్ధిక ప్యాకేజీ పేరున రూ.11,440 కోట్లు

ఇచ్చినట్లే ఇచ్చి, వాటిని అప్పులు తీర్చడానికి, ప్రభుత్వానికి పన్నులు కట్టడానికే వినియోగించారు. ఇనుప గనులు కేటాయింపు, సెయిల్‌లో విలీనం వంటి పరిష్కారాలకు కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తూనే వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కనీసం అడగడం కూడా మానేసింది.

ముడి సరుకు సమస్య అలాగే ఉంది. పెర్మనెంటు కార్మికులకు గత ఎనిమిది నెలలకు పైగా జీతాలు కూడా పూర్తిగా ఇవ్వడం లేదు. 1200 మందిని విఆర్ఎస్ పేరున తీసేశారు. ఇంకా తీయడానికి ప్రణాళికలు వేస్తున్నారు. 4500 మందిని కాంట్రాక్టు కార్మికుల్ని తొలగించారు. దీనికి వ్యతిరేకంగా జరిగిన సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసు పహారాతో, తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. డబుల్ ఇంజన్ సర్కార్ ప్రభుత్వ రంగ విశాఖ స్టీల్ ను ఎలాగైనా అమ్మేయాలని చూస్తున్నది.

ఒక పక్క ఈ స్టీల్ ప్లాంటును బలహీనపరుస్తూ, మరో పక్క దీనికి సమీపంలోనే అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఆర్సనల్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్పీడుగా సన్నాహాలు చేస్తోంది. ఇంకా ఏర్పడని దీనికి గనులు కూడా కేటాయించమని కేంద్రాన్ని కోరడం, వాటి సరఫరాకు ప్రత్యేక పైపు లైన్ ఏర్పాటుకు అనుమతి కోరడం, ప్రత్యేక పోర్టుకు అనుమతి, భూమి కేటాయింపు – వంటివన్నీ చకచకా జరిగిపోతున్నాయి. ఇటీవల ప్రధాని విశాఖ పర్యటన బహిరంగ సభలో ముఖ్యమంత్రి విశాఖ స్టీల్ ప్రస్తావన కూడా చేయలేదు, మరోపక్క మిట్టల్ స్టీల్ గురించి మాత్రం ప్రస్తావించారు.

వెరసి కూటమి ప్రభుత్వ కాలంలో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ స్థితి పెనంలోంచి పొయ్యిలో పడ్డట్లయింది.

**స్థూలంగా:**

ఉత్తరాంధ్రకు, విశాఖకు ఈ కాలంలో మరింత అన్యాయమే జరిగింది. ఒక్క నీటి ప్రాజక్టు నిర్మాణం కూడా పూర్తి కాలేదు. వివిధ పారిశ్రామిక సమ్మిట్ల పేరున ఆర్భాటాలు చేస్తూ, ఆ పేరున విశాఖలో పెద్ద ఎత్తున కార్పొరేట్ సంస్థలకు భూ కేటాయింపులు, భూ పందేరాలు జరిగాయి. నేడూ కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం నిలిపేసిన "లులు మాల్" కు కూడా ఈ ప్రభుత్వం భూమిని ఇచ్చేసింది.


# రాయలసీమ అభివృద్ధి

ముఖ్యమంత్రి ఈమధ్య ఒక మీటింగ్ లో మాట్లాడుతూ, రాయలసీమలో ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వడం తన కల అన్నారు. రకరకాల క్లస్టర్లను రాయలసీమకు తెస్తామని చెబుతూన్నారు. కానీ, ఏ క్లస్టరూ కనపడటం లేదు. మొన్న కడప మహానాడులో 'రాయలసీమ అభివృద్ధికి తన వద్ద బ్లూ ప్రింట్ ఉందని, పక్కా ప్రణాళిక ఉందని' గట్టిగా ప్రకటించారు. ఆ బ్లూ ప్రింట్ ఏమిటో బహిరంగంగా ప్రకటించాలి. తాగు నీటి పరిస్థితి మెరుగుకాకపోగా ఎలా దిగజారుతోంది.

హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేయాలని, తుంగభద్ర నుండి రావాల్సిన నీటి వాటా పూర్తిగా, రాబట్టుకోవాలని, పోతిరెడ్డిపాడు లో నిలిచిపోయిన పనులను పూర్తి చేసుకోవాలి. హంద్రీనీవాను పూర్తి చేస్తామని, గుండ్రేవుల, వేదవతి నిర్మిస్తానని చెప్పింది. బడ్జెట్ లో నిధులు కేటాయిస్తామని, త్వరలోనే నీళ్లు విడుదల చేస్తామని ప్రభుత్వాలు ప్రకటనలు చేయడమే తప్ప ఆచణరలో అడుగు ముందుకు వేసిందిలేదు. గోదావరి – బనకచర్ల అనుసంధానం పేరు చెప్పి, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను, పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

రాయలసీమలో ఉన్న యూనివర్సిటీలన్నీ, విద్యార్థులు లేక, టీచింగ్ ఫ్యాకల్టీ లేక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాయి. వీటిని పునరుజ్జీవనం చేసే దిశలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు లేవు. విభజన చట్టంలో చెప్పిన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పడి ఏళ్లు గడిచినా, వాటికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి నిధులను ఇవ్వడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం అడగడమూ లేదు. రాయలసీమలో ప్రతిష్టాత్మకమైన ఒక్క వైద్య సంస్థ కూడా లేదు. అనంతపురంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కానీ, తిరుపతిలో ఉన్న స్విమ్స్ కానీ, కర్నూల్లో ఉన్న మెడికల్ కాలేజీ ఆసుపత్రిని కానీ నాణ్యమైన, ఉన్నత వైద్య సంస్థలుగా మార్చాలనే ఆలోచన ప్రభుత్వాలకు లేదు. వాటి సేవలకు తగినట్టుగా అవసరమైన బడ్జెట్ ను కూడా కేటాయించడలేదు. రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రోత్సహించడం పోయి మంజూరైన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తున్నారు.

రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా, విత్తన రాజధానిగా మారుస్తామని కూటమి ఎన్నికల ప్రణాళిక హామీ ఇచ్చినా చర్యలు లేవు రాయలసీమను విత్తన రాజధానిగా




మారుస్తామని చెప్పినా జరిగింది శూన్యం.

రాయలసీమను ఆటో మొబైల్ హబ్ గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కియా, దానికి సంబంధించినవి తప్ప, ఏదైనా కొత్త ఆటోమొబైల్ కంపెనీ వచ్చిన దాఖలా లేదు. బెంగళూరు చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, ఓర్వకల్ ను డ్రోన్ సిటీ, కడప ఉక్కు పరిశ్రమ నిత్య హామీలుగా వున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, ప్రధాన కార్యాలయాన్ని కడప నుండి విజయవాడకు తరలించారు.

గ్రీన్ ఎనర్జీ పేరుతో లక్షల ఎకరాల రాయలసీమ భూమిని, రైతుల నుండి చౌకగా అంబానీ, ఆదానీలకు అప్పగిస్తున్నారు. విభజన చట్టంలో, రాయలసీమ అభివృద్ధికి చట్టబద్ధమైన హక్కులు ఉన్నాయి. కానీ బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ, ప్రత్యేక హోదా ఊసే లేకుండా చేశారు.

ఈ ప్రాంతంలో విస్తారంగా ఉన్న భూముల్ని, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే, వినాశక అభివృద్ధి మార్గం కాకుండా, సన్న కారు చిన్న కారు మధ్యతరగతి రైతుల చేతుల్లో ఉన్న, ఈ అత్యధిక శాతం భూమిని, వారి చేతుల్లోనే ఉంచి, వ్యవసాయ కూలీలను, వృత్తిదారులను, దళితులను ఆదుకునే వ్యవసాయాధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయాలి.

## వెనుకబడిన జిల్లాగా ప్రకాశం

రాయలసీమ, ఉత్తరాంధ్రతోపాటు ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. కానీ ఒక్కపైసా నిధులు విదల్చలేదు. మార్కాపురం మెడికల్ కాలేజీ, ఒంగోలు ప్రకాశం యూనివర్శిటీలకు దిక్కులేదు. వెలిగొండ ప్రాజెక్టు నత్తనడక నడుస్తోంది. జిల్లా సమగ్రాభివృద్ధికోసం రూ. 10 వేల కోట్లు కేటాయించాలన్న డిమాండ్‌తో ఉద్యమం నడుస్తోంది.

# ముగింపు

కూటమి పాలన అంచనా వేయడానికి ఒక సంవత్సర కాలం తక్కువే కావచ్చు. కానీ నడక ఏ దిశగా సాగుతుందో అర్థం చేసుకుంటే ఆందోళనపడక తప్పదు. కమ్యూనిస్టులు రాజకీయ కక్షతో విమర్శలు చేయడం లేదు. వారెప్పుడూ ప్రజలతోనే ఉంటారు. ప్రజా ప్రయోజనానికే అగ్రపీఠం వేస్తారు. రాష్ట్రంలో అధికారంలో ఏ పార్టీ ఉన్నా కమ్యూనిస్టులు ప్రత్యేకించి సిపిఐ(యం)పై అక్కసు వెళ్లగక్కుతూనే ఉంటారు. అయినా మొక్కవోని దీక్షతో పట్టుదలతో ప్రజాపక్షాన నిలబడి పోరాటాలు సాగిస్తూనే ఉంటుంది. ప్రజా ఉద్యమాల ద్వారా వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలను బలపరిచి ఒక నూతన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ప్రజలకు అందించడమే సిపిఐ(యం) లక్ష్యం. అన్ని పీడిత వర్గాలు, తరగతుల తరపున నిలబడి రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలకు ప్రజల్ని సంసిద్ధం చేయడానికి సిపిఐ(యం) కృషి చేస్తుంది.


ప్రతులు :.20000 ప్రచురణ కాలం : జూన్, 2025 వెల : ₹ .10/-

ప్రచురణ

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

27-30-9, గవర్నర్‌పేట, విజయవాడ - 2

ఫోన్ నెం. 0866-2577202